

సాలుమరద పురస్కార గ్రహీతలతో మంత్రులు, సమితి ప్రతినిధులు

వృక్షమాతే ఆదర్శం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని ఒంటబట్టించుకుని జాతీయ రహదారులకు ఇరు వైపులా ఎనిమిది వేల మొక్కలు నాటి, నీరు పోసిన వృక్ష మాత 'సాలుమరద' తిమ్మక్కను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే పిలుపునిచ్చారు. ఆమె జీవిత చరిత్రను రాసి కొందరు డాక్టరేట్లు పొందారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమెకు పద్మశ్రీ పురస్కారాన్ని ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ ర్యాంకుతో పర్యావరణ రాయబారిగా నియమించినట్లు చెప్పారు. తిమ్మక్క 113వ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, ఇమ్మడి సిద్ధరామేశ్వర స్వామి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రమణారావు తదితరులతో కలిసి సత్కరించి మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి తిమ్మక్క పేరిట నేషనల్ గ్రీనరీ అవార్డులను ప్రదానం చేశారు. బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తే భూతాపమానం అదుపులోనికి వస్తుందన్నారు. వృక్ష మాత భారతదేశంతో పాటు 2016లో బీబీసీ నిర్వహించిన అత్యంత ప్రభావశాలి మహిళల జాబితాలోనూ స్థానం దక్కించుకున్నారని గుర్తు చేశారు.



తిమ్మక్కకు పూలాభిషేకం

నవ జీవనానికి నాంది

- బెంగళూరుకు సమాంతరంగా మహానగరం
- క్విన్ సిటీకి రూపం.. రేపటి తరానికి ఆవాసం


క్విన్ సిటీ.. ప్రత్యేకతలు

- స్థలం : దొడ్డబళ్లాపుర- దాబస్‌పేటె మధ్య
- బెంగళూరు నుంచి దూరం : 50 కి.మీ
- విమానాశ్రయం నుంచి : 45 కి.మీ
- నవ్య నగర విస్తీర్ణం : 5,800 ఎకరాలు
- నివసించే జనసంఖ్య : 5 లక్షలు
- జిల్లాలు : 4 విజ్ఞానం (నాలెడ్జ్), ఆరోగ్యం (హెల్త్), నవ్యాలోచనలు (ఇన్నోవేషన్), పరిశోధనలు (రీసెర్చ్)
- తొలిదశలో నగరం : 500 ఎకరాల్లో
- మొత్తం వ్యయం : రూ.40 వేల కోట్లు
- ఉపాధి : లక్షమందికి
- తొలిదశ పూర్తయ్యే సమయం : 2025-2026

ఈనాడు, బెంగళూరు : సింగపూర్‌లో బయోపోలిస్, అమెరికాలో రీసెర్చ్ ట్రయాంగిల్ పార్క్‌ల గురించి తెలుసుకున్న వారెవరైనా అలాంటి చోట్ల కనీసం ఒక్కరోజైనా గడపాలని కలలు కంటారు. ఆ స్వప్నాన్ని సాకారం చేసుకునే భాగ్యం కర్ణాటక ప్రజలకు దక్కనుంది. ఇప్పటికే భారతీయ 'సిలికాన్ వ్యాలీ'గా పేరొందిన బెంగళూరు నగరం శాస్త్ర, సాంకేతిక, అంకుర, నవ్యాలోచన, పర్యావరణ వ్యవస్థల్లో ప్రపంచ అగ్రగామి నగరాలను తలదన్నేలా ఉన్నా మౌలిక సదుపాయాల్లో నిత్యం విమర్శలు ఎదుర్కొంటూనే ఉంది. ఈ సమస్యను అధిగమించాలని ఏలికలు ప్రయత్నాలు చేస్తున్నా నగర భౌగోళిక స్వరూపం అందుకు సహకరించదని తెలిపోయింది. రాష్ట్రంలోని సాంకేతిక వనరులు, మేధో సంపదను సద్వినియోగం చేసుకునేందుకు ఓ భవ్య నగరానికి శ్రీకారం చుట్టింది సర్కారు. రాష్ట్ర రాజధానికి 50 కిలోమీటర్ల దూరంలో క్విన్ సిటీ (నాలెడ్జ్ వెల్‌నెస్, హెల్త్, ఇన్నోవేషన్, రీసెర్చ్)కి గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గం పునాదులు వేసింది. భావితరం జీవించేందుకు అనువైన ఈ మహా నగరం విశేషాలిలా ఉన్నాయి.

సుస్థిర జీవన కేంద్రం

కొత్తతరం జీవనం కోసం రూపొందించిన నగరమే క్విన్ సిటీ. కీలక రంగాల మధ్య అనుసంధానం, సుస్థిరత, నాజూకు జీవనం కోసం దీన్ని రూపొందిస్తున్నారు. బెంగళూరు నగర జనసంఖ్య అంతకంతకూ పెరిగి సగటు జీవనం సంక్లిష్టంగా మారుతోంది. తాగునీరు, ట్రాఫిక్, పర్యావరణ పరిరక్షణ, జలవనరుల సంరక్షణ వంటివి పట్టుతప్పిపోయాయి. కేవలం సాంకేతిక పరిజ్ఞానం విస్తరించి ఉపాధి అవకాశాలు పెరిగినా అందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించే ప్రయత్నాలు సఫలం కాలేదు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా క్విన్‌సిటీ రూపొందిస్తున్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలోని దొడ్డబళ్లాపుర- దాబస్‌పేటె మధ్య 5,800 ఎకరాల్లో నిర్మించే ఈ మహానగరానికి గురువారం విధాన సౌధ బాంక్వెట్ హాల్‌లో శ్రీకారం చుట్టారు. బెంగళూరు నగరం నుంచి 50 కి.మీలు, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 45 కి.మీలు, బెంగలూరు-పుణె గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నుంచి ఐదు కి.మీ, జాతీయ రహదారులు 44, 648తో పాటు బెంగళూరు, హుబ్బళ్లి-ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు మార్గానికి ఈ నగరం అనుసంధానంగా రూపొందిస్తున్నారు. ఏడాదిలోనే తొలిదశ పనులను పూర్తి చేయాలని సర్కారు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. మొత్తం 5,800 ఎకరాల విస్తీర్ణంలోని 500 ఎకరాల పరిధిలో పనులు పూర్తి చేస్తారు. మొత్తం నగరంలో ఐదు లక్షల మంది సుస్థిర జీవనానికి అవసరమైన సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి.



క్విన్ సిటీ నమూనా.. ఆధునిక హంగుల హోరు..

ప్రకృతి సేద్యం..

ఈ నగరంలో 465 ఎకరాల్లో సౌరవిద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు కానుండగా, వీటి ద్వారా 0.69 మెగావాట్ల విద్యుదుత్పాదన సాధ్యం కానుంది. ఈ నగరానికి అవసరమైన నీటిలో 50 శాతం ఆధునిక వాననీటి సంరక్షణ విధానాలతో సమకూరుస్తారు. మరో 20 శాతం బోరుబావుల ద్వారా సేకరిస్తారు. ఈ మొత్తం విస్తీర్ణంలో 40 శాతం ఉద్యానాల నిర్మాణానికి, 200 ఎకరాల్లో ఏడు వేల టన్నుల పండ్లు, కూరగాయల తోటలకు, 60 శాతం జలనరుల పునఃవినియోగానికి కేటాయిస్తారు. ఇక్కడి ప్రతి కట్టడం పర్యావరణ స్నేహి విధానాలతో నిర్మిస్తారు. మొత్తంగా హరిత ఇంధనం, కాలుష్య రహిత జీవనానికి ఈ నగరం కేంద్రం కానుంది.



కొత్తతరం జీవనానికి దివ్యమైన వ్యూహం

దార్శనికతకు వేదిక

క్విన్‌సిటీలో నాలుగు కీలకమైన జిల్లాలు ఆర్థిక, సామాజిక, వాణిజ్య, విద్య, ఉపాధి, ఉత్పాదన, సాంకేతిక రంగాల ప్రగతికి కర్మాగారాలుగా తయారవుతున్నాయి. నాలెడ్జ్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ పాఠ్యక్రమాన్ని అనుసరించే జాతీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలు, యూజీసీ మార్గదర్శకాలతో నిర్వహించే ఈ సంస్థలు 500 విదేశీ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు చేసుకుంటాయి. విద్యా, పారిశ్రామిక రంగాల భాగస్వామ్యంతో ఈ జిల్లా ఏర్పాటవుతుంది.

- ఆరోగ్య జిల్లాలో జీవ విజ్ఞాన పార్క్‌లో ఆసియాలో ప్రఖ్యాత ఆరోగ్య సంస్థలతో మెడికల్ హబ్‌గా తయారు చేస్తారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య సదుపాయాలు, చికిత్సలతో ఆస్పత్రులు నిర్మిస్తారు.
- నవ్య ఆలోచనల జిల్లాలో.. కొత్తతరం రంగాలైన జీవ విజ్ఞానం, ఫ్యూచర్ మొబిలిటీ, సెమీకండక్టర్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ఉత్పాదన, వైమానిక, రక్షణ, అంతరిక్ష సాంకేతిక రంగాలన్నీ ప్రపంచ స్థాయి వాణిజ్య, వ్యాపార విపణితో అనుసంధానం చేసి ఉంటాయి.
- పరిశోధన జిల్లాలో.. ఆధునిక సాంకేతికతలపై పరిశోధనలు, ప్రయోగాత్మక పరీక్షలు, ప్రయోగశాలలు, వీటిని ప్రచురించే ముద్రణాలయాలు, సమావేశాలతో ప్రపంచ విజ్ఞాన ఆర్థికతకు దోహదం చేస్తాయి. ఈ జిల్లాల్లోనే కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మేధావుల మండలి

ఈ నగర నిర్మాణానికి రాష్ట్రానికి చెందిన ప్రముఖులతో కూడిన సలహా మండలిని స్థాపించారు. ఇందులో డాక్టర్ దేవీశెట్టి(నారాయణ హెల్త్), కిరణ్ మజుందార్‌షా (బయోకాన్), మోహన్‌దాస్ పై (ఇన్ఫోసిస్), ప్రశాంత్ ప్రకాశ్ (యాక్సెల్), రాంచ్ కింబాల్ (బోస్టన్ విశ్వవిద్యాలయం), థామస్ ఓషా (వెక్స్‌ఫర్డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) నిఖిల్ కామత్ (జిరోదా), రాష్ట్ర ఐటీ బీటీ, వాణిజ్య, పరిశ్రమలు, ఉన్నత విద్య, వైద్య విద్యశాఖల కార్యదర్శులతో కూడిన సలహా మండలి సభ్యులుగా ఉన్నారు.



ప్రకృతి ఒడిలో జీవన పయనం

రాష్ట్ర భవితకు ప్రతీక

ఈనాడు, బెంగళూరు : బెంగళూరు గ్రామీణ జిల్లాలో ఏర్పాటు చేయనున్న 'క్విన్ సిటీ' కర్ణాటక ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీక కానుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. ఆయన గురువారం విధానసౌధలో ఈ మహానగర నిర్మాణ తొలిదశ పనులను ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రానికి నవ్యాలోచనల చరిత్ర ఉందన్నారు. నాలుగో శతాబ్దిలో బనవాసి కేంద్రంగా కదంబ పాలకులు స్వదేశీ పరిజ్ఞానంతో ఆలయాలను నిర్మించి నవ్యాలోచనలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అప్పటి నుంచి 16 శతాబ్దాలుగా ప్రగతి సాధిస్తున్న కన్నడనాడు 20వ శతాబ్దానికి శాస్త్ర సాంకేతికతల్లో దేశానికి నాయకత్వం వహిస్తుందన్నారు. బెంగళూరులో 1909లో స్థాపించిన భారతీయ విజ్ఞాన సంస్థ, 1940లో హెచ్ఏఎల్, 1970లో ఎలక్ట్రానిక్స్ సిటీని నిర్మించగా.. నేడు ఐటీ విప్లవానికి కేంద్రంగా మారింది. రాష్ట్రంలో 45 యునికార్న్‌లు, 17 వేల పెట్టుబడిదారుల సాయంతో 15 వేల అంకుర సంస్థలను నిర్వహిస్తున్నారని వివరించారు. అత్యంత సమర్థమంతమైన పర్యావరణ వ్యవస్థ కలిగిన రాష్ట్రానికి క్విన్ సిటీ విజ్ఞాన, ఆరోగ్య, నవ్యాలోచన, పరిశోధనల్లో కొత్తతరానికి అనువైన సదుపాయాలతో సిద్ధమవుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రపంచ స్థాయి సవాళ్లకు పరిష్కారంగా, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో సుస్థిర దేశీయ స్థూల జాతీయోత్పత్తిని సాధించే లక్ష్యంతో నిర్మించే ఈ నగరం విజ్ఞాన వినిమయం, పారిశ్రామిక ఉద్యోగిత, ఉపాధి అవకాశాలు, ప్రామాణిక వైద్యం, సుస్థిర అభివృద్ధి, ఆర్థికతకు సంకేతంగా నిలవనుందని పేర్కొన్నారు. దేశ నవ్యాలోచనలకు ఈ నగరం మైలురాయి కానుందన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య పరిశ్రమల మంత్రి ఎం.బి.పాటిల్ మాట్లాడుతూ ఈ నగరం రాష్ట్ర పరిశ్రమల ప్రగతికి, ప్రపంచ వ్యాపార వినిమయానికి వేదికగా మారుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కేవలం దేశ, విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోనుందని వివరించారు. కొత్త నగరంతో రాష్ట్రం ప్రపంచ నవ్యాలోచనల శక్తి కేంద్రంగా మారనుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హెచ్.కె.పాటిల్, ప్రియాంక్ ఖర్గే, దినేశ్ గుండూరావ్, జమీర్ అహ్మద్, డాక్టర్ ఎం.సి.సుధాకర్, పారిశ్రామికవేత్తలు ప్రశాంత్ ప్రకాశ్, గీతాంజలి కిర్లోస్కర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి గుంజన్ కృష్ణ, కేఐఏడీబీ సీఈఓ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్విన్ సిటీ పనులను లాంఛనంగా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు

దొంగతనం చూసిందని.. హత్య

బెళగావి, న్యూస్‌టుడే : శిందోళ్లి మసణవ్వ దేవాలయంలో దొంగతనం చేసుకుని పరారవుతున్న నిందితులు భారతి పూజారి (48) అనే గృహిణిని హత్య చేసి బావిలో పడేశారు. ఆలయం సమీపంలోని దిబ్బపై చెత్త పడేసి ఆమె ఇంటికి వెళుతున్న సమయంలో దొంగలు ఎదురయ్యారు. ఆమెపై దాడి చేసి నిందితులు అక్కడి బావిలో మృతదేహాన్ని పడేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు జరిగిన ఘటనను గుర్తించారు. బెళగావి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లోకాయుక్త ఎస్పీ ఎక్కడ?

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు లోకాయుక్త ఎస్పీ కనిపించడం లేదని సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కార్యాలయానికి వెళ్లినా కనిపించలేదని, ఫోన్‌కు స్పందించలేదని దేవరాజ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. ముడాలో అక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించడానికి కావలసిన వివరాలను అందించేందుకు ఎస్పీని కలవాలనుకుంటే వీలు కాలేదన్నారు.

కాల్పుల్లో యువకుడికి గాయాలు

కలబురగి, న్యూస్‌టుడే : మద్యం తాగుతున్న సమయంలో స్నేహితుల మధ్య గొడవలో శ్రీకాంత్ అనే వ్యక్తి తుపాకీతో కాల్చాడు. ఎడమ చేతికి తూటా తగిలి శాంతప్ప పూజారి అనే యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆళంద తాలూకా కడగంచి గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కాల్పులు జరిపిన ఆరోపణలపై శ్రీకాంత్, కాంతప్ప, మాళప్పలను నరోణ ఠాణా పోలీసులు అరెస్టు చేసి, తుపాకీని స్వాధీనపరుచుకున్నారు.

అనుమానిత ఉగ్రవాది అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర శివారు జిగణి పారిశ్రామికవాడలో కాపలాదారుడిగా పని చేస్తున్న ఓ అనుమానిత ఉగ్రవాదిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు గురువారం అరెస్టు చేశారు. ఆ వ్యక్తి అసోంకు చెందిన గిరీశ్ (23)గా గుర్తించారు. ఆగస్టు 10 నుంచి పారిశ్రామికవాడలోని ఓ సంస్థలో కాపలాదారుడిగా పని చేస్తున్నట్లు తేలింది. అసోం తీవ్రవాద సంస్థలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఎన్ఐఏ అధికారులు తెల్లవారు జామున దాడిచేసి పట్టుకున్నారు.

భార్యపై కోపం.. చెట్లపై ప్రతాపం

హావేరి, న్యూస్‌టుడే : తన భార్యతో గొడవ పడిన బసవరాజ అనే వ్యక్తి తన మామ దేవేంద్రప్ప ఫకీరప్ప గాణిగేరాకు చెందిన వక్క తోటలో 106 చెట్లను నరికి వేశాడు. పుట్టింటికి వచ్చిన తన భార్యను అత్తామామలు పంపించకుండా తమ వద్దే ఉంచుకున్నారని గొడవ పెట్టుకున్నాడు. వారి ఇంటికి సమీపంలో ఉన్న వక్కతోటకు వెళ్లి చెట్లను నరికి పరారయ్యాడు.

ఆలయ బాటలో నలుగురి దుర్మరణం

బాగలకోటె, న్యూస్‌టుడే : హునగుంద తాలూకా ధన్నూర టోల్‌గేట్ సమీపాన గురువారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మరణించారు. లక్ష్మణ (55), బైలప్ప (45), రామణ్ణ (50), కారు డ్రైవరు మహ్మద్ రఫీక్ గుడ్నాళ (25)లను మృతులుగా గుర్తించారు. వీరందరూ విజయపుర జిల్లా ముద్దేబిహాళకు చెందిన వారు. కొప్పళ జిల్లాలో వెలసిన హులిగమ్మ అమ్మవారిని దర్శించుకుని తమ ఊరికి తిరిగి వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. హునగుంద ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఉత్సవ ఫిరంగుల మోత: చారిత్రక మైసూరు దసరా సంబరాల సందర్భంగా గజరాజులు మరింత ధైర్యంగా అడుగు ముందుకేయడానికి వాటి ముందు ఫిరంగులు పేల్చి.. పరీక్షించే క్రతువు గురువారం నిర్వహించారు. ప్యాలెస్ మైదానంలో వరుసగా ఫిరంగులు పేల్చుతున్న నిపుణులను చిత్రంలో చూడొచ్చు. **(న్యూస్‌టుడే, మైసూరు)**

ఎలక్ట్రానిక్ సిటీలో చిరుత ఆటకట్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఎలక్ట్రానిక్ సిటీ- ఆనేకల్ మధ్య సంచరిస్తున్న ఐదేళ్ల వయసున్న చిరుతను అటవీశాఖ అధికారులు బంధించారు. దాన్ని బన్నేరుఘట్ట అటవీ విభాగానికి తరలించారు. వారం నుంచి చిరుత పలువురికి కనిపించింది. జాతీయ రహదారి దాటుతూ కనిపించిన చిరుతను కొందరు వాహనదారులు తమ చరవాణి కెమెరాల్లో చిత్రీకరించారు. ఆయా ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశారు. ఒక బోనులో చిరుత పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నన్ను కొట్టింది.. అందుకే చంపేశా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : 'ఆమె.. నా వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ గొడవపడి దాడి చేసి కొట్టింది. ఆత్మాభిమానం దెబ్బ తినడంతో ఆమెపై ప్రతిదాడి చేసి గొంతు నులిమి కడతేర్చా. మృతదేహాన్ని స్నానం గదిలోకి తీసుకువెళ్లి ఆక్సల్ బ్లేడ్‌తో 59 ముక్కలు చేసి.. ఫ్రిజ్‌లో ఉంచా. వాసన రాకుండా రసాయనాలను పిచికారీ చేసి, స్నానాల గదిని శుభ్రం చేసి.. ఆ ఇంటికి తాళం వేసి రైల్లో ఒడిశాలోని మా ఊరికి వచ్చా' అంటూ బెంగళూరులో సంచలనానికి కారణమైన మహాలక్ష్మి హత్య కేసు నిందితుడు ముక్తిరంజన్ రాయ్ తన మరణోత్తర లేఖలో ప్రస్తావించాడు. ఆ లేఖరాసి.. చివరికి అతడు బుధవారం చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వయ్యాలికావల్ మునేశ్వర బ్లాక్‌లో నేపాలీ యువతి మహాలక్ష్మిని రాయ్ చంపిన తీరు దిగ్భ్రాంతికరం. నిందితున్ని పట్టుకోవడానికి బెంగళూరు పోలీసులు ప్రయత్నిస్తున్న వేళ.. చివరికి ఒడిశాలోని ఫండి గ్రామ శ్మశానవాటికలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడున్న లేఖతో పాటు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 24న రాత్రి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లిన రాయ్.. మరుసటి రోజు కుళేవాడ శ్మశానవాటికలో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని దుశిరి పోలీసుఠాణాలో స్థానికులు ఫిర్యాదు చేశారు. రాయ్- లక్ష్మి ఇద్దరూ మల్లేశ్వరంలోని ఓ సంస్థలో పని చేస్తున్నారు. ఇద్దరి మధ్య ప్రేమ మొగ్గతొడిగి.. సహజీవనం సాగించారు. ఆ కర్మాగారంలో టీమ్ మేనేజరుగా పనిచేసిన రాయ్ ఇతర యువతులతో చనువుగా మాట్లాడటం ఆమెకు ఆగ్రహం తెప్పించి గొడవకు దిగేదని తేలింది. ఓ బిడ్డకు తల్లైన ఆమెతో పెళ్లికి రాయ్ నిరాకరించాడు. వారం రోజులు సెలవు పెట్టిన ఆమె ఉంటున్న గదికి రాయ్ 21న సాయంత్రం వెళ్లిన సమయంలో గొడవ పతాక స్థాయికి చేరిందని రాయ్ లేఖ ద్వారా గుర్తించారు. 'నాతో గొడవకు దిగి దాడిచేసింది. కోపం పట్టలేక ఆమెను కొట్టాను. గొంతు నులిమేసరికి చనిపోయింది. ఏమి చేయలో అర్థం కాక.. బయటకు వెళ్లి ఆక్సల్ బ్లేడ్ తెచ్చి మృతదేహాన్ని స్నానాల గదిలోకి లాక్కువెళ్లి ముక్కలుగా చేశా. వాటిని ఫ్రిజ్‌లో కుక్కా'నంటూ లేఖలో వివరించడం ప్రస్తావనార్హం.



ఒడిశాలోని ఓ శ్మశాన వాటికలో ముక్తిరంజన్‌రాయ్.. చివరికిలా మిగిలాడు



మహాలక్ష్మి (పాతచిత్రం)

నా బిడ్డను ఇరికించారు..

ఇంటర్నెట్‌డెస్క్ : తన కుమారుడిని హత్య కేసులో ఇరికించారని.. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బెంగళూరులో మహిళ హత్య కేసు ప్రధాన నిందితుడు ముక్తిరంజన్ రాయ్ తల్లి వాపోయారు. అతడి తల్లి కుంజలతా రాయ్ ఓ వార్త సంస్థతో మాట్లాడుతూ 'తనను ఆ మహిళ తరచూ డబ్బులు అడిగేదని చెప్పేవాడు. మరి ఉద్యోగం మానేసి.. బెంగళూరు నుంచి ఎందుకు పారిపోయావని నేను ప్రశ్నించగా.. భయపడే అలా చేసినట్లు చెప్పాడు' అని పేర్కొన్నారు.

- ఈ కేసులో ప్రధాన అనుమానితుడిగా ఉన్న ముక్తి రంజన్ రాయ్ ఒడిశాలోని భద్రక్ జిల్లాలో ఆత్మహత్య చేసుకొన్నాడని బెంగళూరు సెంట్రల్ డీసీపీ ప్రకటించారు. రాయ్‌కు సంబంధించిన డైరీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. తాను మహాలక్ష్మిని 59 ముక్కలుగా నరికినట్లు అందులో ఒప్పుకొన్నాడు.
- బెంగళూరులో మహాలక్ష్మి మృతదేహం బయటపడిన సమయంలో తొలుత ఆమె మాజీ భర్తను పోలీసులు అనుమానించారు. మృతురాలికి మరో వ్యక్తితో బంధంలో ఉందని తేలడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేశారు.

కమలదండు పోరుబాట



మహాత్ముని విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న భాజపా నాయకులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముడా నుంచి అక్రమంగా 14 ఇళ్ల స్థలాలను పొందారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని భాజపా స్పష్టం చేసింది. విపక్ష నాయకుడు అశోక్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విధానసౌధ ఆవరణలోని మహాత్ముని విగ్రహం వద్ద గురువారం ధర్నాకు దిగారు. సిద్ధరామయ్య రాజీనామా చేయాలని, ఆయన కార్యాలయానికి తాళం వేస్తానంటూ వెళుతున్న నాయకులను పోలీసులు, భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. బీఎంటీసీ బస్సుల్లో వారికి ఎక్కించి హైగ్రౌండ్స్ ఠాణాకు తరలించారు. కొంత సమయం అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. ముడాలో అక్రమాలపై విచారణకు ఉన్నత న్యాయస్థానం, లోకాయుక్త ఆదేశించిన నేపథ్యంలో సిద్ధరామయ్య తక్షణమే పదవికి రాజీనామా చేసి, విచారణకు సహకరించాలని అశోక్ డిమాండ్ చేశారు. ఎంత మొండిగా వ్యవహరించినా, తన పదవికి రాజీనామా చేయవలసి ఉంటుందని సిద్ధరామయ్యకు తెలుసని అన్నారు. సీఎం మేకపోతు గాంభీర్యం అందరికీ తెలుస్తుందని చెప్పారు. రాజ్యాంగానికి గౌరవమిచ్చి విచారణకు హాజరు కావాలని హితవు పలికారు. సీనియర్ నేతలు చలువాది నారాయణ స్వామి, గోవింద కారజోళ, పీసీ మోహన్, జగ్గేశ్, అరవింద బెల్లద్, గాలి జనార్ధనరెడ్డి తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.



విపక్ష నాయకుడ్ని అరెస్టు చేసి తీసుకువెళుతున్న భద్రతా సిబ్బంది



భాజపా నేతల మాస్కులతో కాంగ్రెస్ కార్యకర్తలు

రామయ్యకే వెన్నుదన్ను

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : హరియాణ విధానసభ ఎన్నికల ప్రచార సమయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు ఆరోపణలు చేశారంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా బెంగళూరు రేస్‌కోర్స్ రోడ్డులోని కాంగ్రెస్ భవన్ ఆవరణలో కార్యకర్తలు గురువారం ధర్నాకు దిగారు. మోదీ రూపాన్ని పోలిన మాస్కులు ధరించి నిరసనకు దిగారు. ఈసందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ మోదీ తీరు ఏమీ బాగాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు 'ఆపరేషన్ కమల' మొదలు పెట్టి విఫలమైనట్లు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు చెడ్డ పేరు తెచ్చేందుకు భాజపా, జేడీఎస్ నేతలు కుట్రపన్నినట్లు ధ్వజమెత్తారు.

విషాహారం తిని విద్యార్థులు ఆస్పత్రిపాలు

హాసన, న్యూస్‌టుడే : బల్లి పడిన ఆహారాన్ని తిని వందకు పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అరకలగూడు తాలూకా రాగిమరూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. మొదట పది మంది విద్యార్థులు వాంతులు చేసుకోగా.. ఆపై మిగిలిన వారూ అలానే నీరసించారు. తీవ్ర అనారోగ్య సమస్య ఎదుర్కొన్నారు. వీరిలో ఎనిమిది మందిని హాసన జిల్లాసుపత్రికి తరలించగా, మిగిలిన వారిని కోణనూరు సముదాయ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా అందించడం లేదని, సాంబారుపై మూత పెట్టకపోవడంతోనే బల్లి పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు.

ప్రగతి మంత్రం..



కన్నడనాట ఆమూలాగ్రం పర్యాటక ప్రాంతాల సమాహారంతో విరాజిల్లుతోంది. ఎటుచూసినా దర్శనీయ స్థలాలే. ఎన్నెన్నో అందాల పుంతలు కానవస్తాయి. రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం తాజాగా ప్రత్యేక పథకాన్నీ అమలు చేస్తోంది. చారిత్రక స్మారకాల దత్తత కార్యక్రమం, కీలక ప్రాంతాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో వసతుల విస్తరణ తదితరాలు ఇందులో భాగమే. ప్రత్యేకించి తీర ప్రాంత పర్యాటకాన్ని అటు కేరళ- ఇటు గోవాతో పోటీపడి విస్తరించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. లెక్కలేనన్ని తీరాలను చక్కగా తీర్చిదిద్దితే అదే ఆర్థికవనరుగా మారుతుందని అంచనా వేస్తున్నారు. సాహస- ఆధ్యాత్మిక- సాగర- ఉద్యాననగరి- నదీనదాల ఆధారంగా జలవేదికల విహారాలను అభివృద్ధి చేయడం ద్వారా దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవాలనేది సర్కారు లక్ష్యం. విహారాన్ని ఐదింటిగా విభజించి.. ఎక్కడికక్కడ ప్రత్యేక వసతులు విస్తరించదలిచారు. ఈ 'పంచ'రత్నాలు.. వనరుల ఉద్దీపనలుగా భావిస్తున్నారు. ఆ వివరాల సమగ్ర విశ్లేషణాంశాలు నేడు 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా.. ఈనాడు పాఠకుల కోసం.. ఇక్కడ అందిస్తున్నాం. తాజా పర్యాటక దినోత్సవాన్ని 'శాంతి'సాధనకు ప్రత్యేకించడం ప్రస్తావనార్హం. వివిధ విహారాల సాయంతో శాంతియుత జీవనానికి బాటలు వేయాలనేది నిపుణుల సంకల్పం.

పర్యాటక పంచతంత్రం!

చారిత్రక దీప్తి.. రాయల కీర్తి

హొసపేటె, న్యూస్‌టుడే : ఆరుబయలు పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన విజయనగర రాజధాని హంపీని దక్షిణ కాశీగా పిలుస్తారు. 42 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన హంపీలో కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు గుర్తించిన 200 స్మారకాలు ఉన్నాయి. అడుగడుగునా స్మారకాలు, గుడులు, గోపురాలు కలిగి ఉండటం విశేషం. హంపీ కేంద్రంగా హొసపేటె, సండూరు ప్రాంతాలు పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతున్నాయి. ● హంపీ పర్యాటక సీజన్ ఏటా అక్టోబరు నుంచి మార్చి వరకూ ఉంటుంది. ఆ వేళల్లో విజయనగర వీధులు దేశ, విదేశాల పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి. కనీసం 30 లక్షల మంది పర్యాటకులు ఏటా హంపీ వస్తారు. అందులో లక్ష మంది విదేశీయులుంటారు. ఐరోపా దేశాల నుంచి వచ్చేవారి సంఖ్య ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం రూ.50 నోటులో హంపీ రాతిరథం బొమ్మను ముద్రించడంతో హంపీ పేరును నలుదిశలా విస్తరించేలా చేసింది. ●రాయలేలిన ఈ చారిత్రక గడ్డను దేశవిదేశాల పర్యాటకులు సజీవ స్మారక ప్రాంతం (లివింగ్ మాన్యుమెంట్) అని పిలుస్తారు. 2008లో యునెస్కో హంపీని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చింది. ఇక్కడ త్రికాల పూజలందుకునే విరూపాక్షుడు కొలువుదీరాడు. పురాణ ప్రసిద్ధిచెందిన ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీ.. అంటూ కీర్తిస్తారు. హావేరి జిల్లా బనవాసి, హంపీలో మాత్రమే కన్నడ మాతా భువనేశ్వరి ఆలయాలు ఉండేది. కాముడి దహనం కూడా ఇక్కడే జరిగినట్లు స్కందపురాణంలో ప్రస్తావన ఉంది.



ఏకశిలా రథం అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు



విహంగ వీక్షణలో హంపీ అందాలు

ఆలయ శిఖరం.. ఆధ్యాత్మిక వైభవం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: చందనసీమలో వేర్వేరు వాతావరణాలు, మట్టి తీరు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచరణలు ఆకట్టుకుంటాయి. అన్ని ప్రాంతాల ప్రజలను ఆలయ పర్యాటకం అనుసంధానం చేస్తోంది. హొయసళ, చాళుక్య, చోళ రాజుల పాలనలో పలు ఆలయాల నిర్మాణం పూర్తి చేయడం చరిత్ర. ఆలయాల నిర్మాణ శైలి ప్రతి ఒక్కరినీ అబ్బురపరిచేలా ఉండడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల సంఖ్య ఎక్కువే. ఆలయాల సమీపానే భక్తులకు సదుపాయాలను మెరుగు పరచేందుకు ప్రైవేటు కంపెనీలతో పర్యాటక శాఖ ఇప్పటికే పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో ప్రసాదాన్ని నందిని నెయ్యితో తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం తాజా పరిణామం. కొన్ని ఆలయాల్లో నిత్యాన్నదాన పథకం కొనసాగుతోంది. ఉత్తర కన్నడ నుంచి చామరాజనగర వరకు, దక్షిణ కన్నడ నుంచి కోలారు వరకు ఉన్న 31 జిల్లాల్లో ఆలయాలకు వస్తున్న భక్తుల సంఖ్య ఏడాదిన్నరలో గణనీయంగా పెరిగింది. ఆర్టీసీలో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు 'శక్తి' పథకాన్ని అమలు చేసిన అనంతరం ఎక్కువ మంది భక్తిమార్గం పట్టి.. మొక్కులు తీర్చుకుంటున్నారు. వివిధ సన్నిధానాల్లో ఆలయాల హుండీ ఆదాయం రెట్టింపైంది. కర్ణాటక పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ పలు ఆలయాలు, పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు రూ.3 వేలతో ప్యాకేజీ టూరు వారం పాటు తిరిగి వచ్చేలా అందుబాటులోకి తీసుకువచ్చింది. శ్రీరంగపట్టణలోని రంగనాథ స్వామి ఆలయం, మండ్య- మద్దరంగ, చామరాజనగర- మలె మహదేశ్వరుడు, మైసూరు- చాముండేశ్వరి, కొడగు- ఓంకారేశ్వరుడు, ధర్మస్థల- మంజునాథుడు, ఉడుపి- శ్రీకృష్ణ, కొల్లూరు- మూకాంబిక, కుక్కె- సుబ్రహ్మణ్య, కద్రి- మంజునాథుడు, హొరనాడు- అన్నపూర్ణేశ్వరి, పావగడ- శనీశ్వర స్వామి, మేలుకోటె- యోగా నరసింహస్వామి, చెలువరాయస్వామి, శృంగేరి- శారదామాత, బెంగళూరు- ఇస్కాన్, రాజరాజేశ్వరి, బనశంకరి, కాడు మల్లేశ్వర ఆలయాలు, కోలారు జిల్లా- కురుడుమలె, చిక్కబళ్లాపుర- భోగనందీశ్వర స్వామి, హంపీ విరూపాక్ష, సవదత్తి- రేణుకా యల్లమ్మ, గోకర్ణ- మహాబలేశ్వర ఆలయాలతో పాటు చిక్కబళ్లాపుర సమీపంలోని జగ్గీ వాసుదేవ ఫౌండేషన్ నిర్వహించే ఆదిదేవుని విగ్రహ ప్రాంగణం, కార్కళలోని పడు తిరుపతి, మాలూరు సమీప చిక్క తిరుపతికి వస్తున్న భక్త పర్యాటకుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.



మేలుకోటె యోగనరసింహ స్వామి ఆలయ వైభవం




ధర్మస్థల మంజునాథేశ్వరుడి కోవెల

హాయి.. హాయిగా సాగిపోదామా

మంగళూరు, న్యూస్‌టుడే: దక్షిణ కన్నడ నుంచి ఉత్తర కన్నడ జిల్లా వరకు 320 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం పర్యాటకులను రా.. రమ్మని పిలుస్తోంది. తీర పర్యాటకంతో పాటు, జలపాతాలు, నదుల వద్దకు వెళుతున్న ఔత్సాహికుల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది. గోకర్ణలోని ఓం బీచ్, కాపు తీరంలో దీప స్తంభం, ఉడుపి సమీపంలోని సెయింట్ మేరీస్ ద్వీపం, ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర నుంచి కార్వార వరకు వెనుక జలాల అందాలు వేటికవే ప్రత్యేకం. గోకర్ణలోని ఓం ఆకారంలో ఉండే తీరం, కుమట వద్ద ఉప్పు తయారీ కయ్యలు, ఓ వైపు నది- మరో పక్క సముద్రం.. మధ్యలో జాతీయ రహదారి కొనసాగే మరవంతె ప్రాంతం అద్భుతమే. వీటితో పాటు కోడి, మల్పె, డెల్టా, మట్టు తీరాలకు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. కేఆర్ఎస్ వద్ద బృందావన్ గార్డెన్, తుంగభద్ర జలాశయం, ఆలమట్టి జలాశయం, భారతదేశ పటాన్ని తలపించే చిత్రదుర్గ వాణివిలాస జలాశయాలలో నీరు ఉన్న సమయంలో పర్యాటకులకు వస్తుంటారు. వర్షాకాలంలో శరావతి నది నుంచి జన్మించిన జోగ్ జలపాతం, గోకాక, హెబ్బె, అబ్బె, మగోడ్, ఇరుప్పు, బన్నెహొలె, దబ్బె, శతొడ్డి, బర్కణ తదితర 35 జలపాతాలకు వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. గోవా, కర్ణాటక సరిహద్దులోని దూధ్‌సాగర్, బాళెహొన్నూరు సమీపంలో అడవుల నడుమ సిరిగెరె జలపాతాలకు కూడా పర్యాటకులు పోటెత్తుతున్నారు. గగనచుక్కి, భర చుక్కి జలపాతాలను రాత్రి లేజర్ కాంతుల వెలుగులో వీక్షించేందుకు ప్రభుత్వం జలపాతోత్సవాలను నిర్వహిస్తోంది. జోగ్ జలపాతాన్ని పై నుంచి కింద వరకు చూసుకుంటూ వెళ్లేందుకు భారీ లిఫ్టు, గోకాక జలపాతంపై నడిచి వెళ్లేందుకు మందపాటి గాజుతో చేసిన వంతెన నిర్మాణాలకు ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనుంది. బృందావన్ గార్డెన్స్‌ను డిస్నీ వరల్డ్ తరహాలో విస్తరించేందుకు ప్రణాళికలను రూపొందించింది. మురుడేశ్వర తీరంలో జల క్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఇతర తీరాల్లోనూ వీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పలు ప్రైవేటు సంస్థలు ముందుకు వచ్చాయి. బీచ్ రిసార్టులు, హోం స్టేలు, బ్యాక్ వాటర్‌లో రాత్రి గడిపేందుకు బోట్ హౌస్‌లు ఆకట్టుకునే అంశాలు. నంజనగూడు సమీపంలో కబిని నదిపై 1735లో దళవాయి దేవరాజు నిర్మించిన వంతెనను చూసేందుకు ఎంతో అపూర్వమనిపిస్తుంది. రాయి, ఇసుక, కోడిగుడ్డు సొన, సున్నం, మైదా తదితరాలను ఉపయోగించి 56 స్తంభాలతో నిర్మించిన ఈ వంతెన ఎనిమిది అడుగుల వెడల్పుతో ఉంటుంది. దీనిపై 1902 వరకు ఎడ్ల బండ్లు వెళ్లేవి. అనంతరం న్యారో గేజ్ వేసి రైలును నడిపారు. కొత్త వంతెన నిర్మాణం అనంతరం గత 17 ఏళ్లుగా ఈ వంతెనను పర్యాటకుల వీక్షణ కోసం ఉంచారు.



జోగ్ జలపాతం.. కనులకింపైన విహార సంకేతం



హొన్నావర- కార్వార మధ్య ప్రయాణమార్గాలే ప్రమోదం

కర్ణాటకాంధ్రుల జీవనాడి



తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు పారే గంగమ్మ

హొసపేటె, న్యూస్‌టుడే : పశ్చిమ కనుమల్లో పుట్టి.. ఉత్తర ప్రాంతాలను తాకుతూ.. విజయనగర సామ్రాజ్యపు రాజధాని హంపీని పవిత్రంచేస్తూ.. మూడు రాష్ట్రాల అన్నదాతలకు ఆసరాగా నిలుస్తూ.. పంట పొలాలకు జీవం పోస్తూ సంజీవనిగా మారుతోంది తుంగభద్ర జలాశయం! రైతులు జీవనాడిగానే కాకుండా తుంగభద్రమ్మ సందర్శకులను రా..రమ్మని పిలుస్తోంది. విజయనగర రాజధాని హంపీ సందర్శనకు వచ్చేవారు తప్పకుండా నదీమతల్లి సోయగాలను ఆస్వాదించటానికి ఇష్టపడుతుంటారు. జలాశయంలో నీటినిల్వలు, పోటు జలాలు, అద్భుతమైన శైలితో నిర్మించిన ఆనకట్ట, దిగువకు నీటిని తీసుకెళ్లే క్రస్ట్ గేట్లు, గలగలపారే నదీ జలాలు తుంగభద్రను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా వాసికెక్కిస్తున్నాయి. ఆనకట్ట నుంచి కంప్లి వరకూ నదీ ప్రాంతాన్ని ఓటర్స్ (నీటిపిల్లుల) సంరక్షణ ప్రాంతంగా అటవీ శాఖ ప్రకటించింది.

● తుంగభద్ర పుట్టుక, ప్రస్థానం మహాద్భుతం. ఇనుప ఖనిజ జిల్లాగా పేరుగాంచిన చిక్కమగళూరులో పుట్టే తుంగ, భద్ర ప్రత్యేక నదులు. అక్కడి నుంచి దిగువకు పారుతూ శివమొగ్గ జిల్లా దిగువన- దావణగెరె సమీపంలో రెండూ కలిసి తుంగభద్రగా అవతరించడం ఓ అద్భుతమే. 1961లో హొసపేటె వద్ద తుంగభద్రకు ఆనకట్ట నిర్మించి దిగువకు వృథాగా పారుతున్న జలాలను ఒడిసిపట్టడం ప్రారంభించారు.

● ఆకర్షణీయమైన ఉద్యానవనాలు తుంగభద్ర ప్రాంతంలో చూడొచ్చు. సందర్శకులు ఉదయం నుంచి రాత్రిదాకా ఈ వనాల్లో సేదదీరుతారు. రాత్రికి సంగీత కారంజీలు రంజింపచేస్తాయి. జింకలు, గులాబీల పార్కు ఆకట్టుకుంటుంది. పిల్లలు, పెద్దలు కూడా వినోదాన్ని అందివ్వడంతో ఈ ప్రాంతంలో తుంగభద్ర పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది.



ఆనకట్ట గట్టుపైనే ఆకట్టుకునే పర్ణజ చేపల ప్రదర్శనాలయం

తెలుగు ప్రముఖుడు సంకురాత్రి నరసింహమూర్తి మృతి



సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా తెలుగు ప్రముఖులు, మాజీ వైమానికాధికారి సంకురాత్రి నరసింహమూర్తి (80) గురువారం సాయంత్రం హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో మృతి చెందారు. గొరేబాళ క్యాంపులోని ఆయన స్వగృహంలో రెండు రోజుల కిందట కాలుజారి కిందపడి ప్రమాదంలో చిక్కుకోగా హుటాహుటిన హైదరాబాదు ఆసుపత్రికి తరలించారు. వైద్యం ఫలించక మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అడ్డరోడ్డు మూర్తిగా తాలూకా ప్రజలకు ఈయన సుపరిచితులు. ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందించి పదవీ విరమణ చేసిన మూర్తి ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో అప్పట్లో గొరేబాళ్‌క్యాంపు సమీపంలోనే గల అడ్డరోడ్డులో పెట్రోలు బంకు స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం సమీపంలోని లక్ష్మీ పోలవరం నుంచి 1970లో సింధనూరు చేరుకున్న మూర్తి వ్యాపారం, వ్యవసాయంతో ఇక్కడే స్థిరపడిపోయారు. ఈయన మృతికి తాలూకా తెలుగు పెద్దలు నివాళి అర్పించారు.

మహిళకు నకిలీ పోలీసుల టోకరా

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొసదుర్గం తాలూకా శ్రీరాంపురం గ్రామంలో ఇద్దరు దుండగులు హెగ్గెరె గ్రామానికి చెందిన సువర్ణమ్మ అనే మహిళ నుంచి బంగారు గొలుసును చోరీ చేసి పరారైన సంఘటన గురువారం జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హెగ్గెరె గ్రామానికి చెందిన సువర్ణమ్మ నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం శ్రీరాంపురానికి వచ్చి ఒంటరిగా బస్టాండు నుంచి గ్రామంలోకి నడుచుకొంటూ వెళ్తుండగా వెంబడించిన ఇద్దరు యువకులు ఆమెను పలకరించారు. తాము పోలీసులమని ఆమె ధరించిన బంగారు గొలుసును తీసి చేతి సంచిలో ఉంచుకొని వెళ్లాలని సూచించారు. దీంతో భయపడిన ఆమె బంగారు గొలుసును మెడలో నుంచి తీసుకొని పర్సులో ఉంచుకొంటుండగా లాక్కొని పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సినీ ప్రపంచ ధ్రువతార..అక్కినేని

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కళారంగంలో తనదైన శైలిలో నటించి.. పాత్రలకు జీవంపోసి ప్రేక్షకుల హృదయాల్లో నవరస నటసార్వభౌముడిగా నిలిచిన సినీప్రపంచ ధ్రువతార అక్కినేని నాగేశ్వరరావని రాఘవస్మారక సంఘం గౌరవాధ్యక్షుడు కనుగోలు చన్నప్ప పేర్కొన్నారు. గురువారం రాత్రి సమతసాహితీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాఘవ సంగీత భవన్‌లో ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నటనలో సాటిలేని మేటి నటుడిగా కీర్తినందుకున్నారని, భక్తి రస, శృంగారమయ, ప్రేమపాత్రలకు జీవం పోసిన మహానటుడు నాగేశ్వరావని ఆయన సేవలను కీర్తించారు. అన్ని భాషల అగ్రనటులు..నాగేశ్వరావు నటనకు మంత్రముగ్ధులయ్యేవారని, నృత్యంతో ప్రేక్షకుల మనసుదోచిన నటుడని రాఘవ స్మారక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు అన్నారు. అక్కినేని నటనగొప్పతనాన్ని వర్ణించలేమని డా.సురేంద్రబాబు అభిప్రాయపడ్డారు. తెలుగు సినీయుగంలో ఏఎన్ఆర్, ఎన్టీఆర్‌లది స్వర్ణయుగమని కీర్తించారు. కళామతల్లి ముద్దబిడ్డగా..ఆదర్శ జీవితం గడిపిన మహనీయుడు, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం నాగేశ్వరరావుదన్నారు. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నాగేశ్వరరావు డైలాగ్‌ను డా.సురేంద్రబాబు వినిపించారు. కళారంగంలో సేవలందించిన కళాకారులు అమరేంద్ర చౌదరి, వలీఅహ్మద్, ప్రవీణ్, గంగణ్ణ, రఘురామ్, శ్రీనివాసులు తదితరులకు అక్కినేని కళాపురస్కారాలు, నటరాజ్, వెంకటేశులుకు కళాసేవాపురస్కారాలు అందజేసి సత్కరించారు. భీమనేని భాస్కర్, ఎం.రామాంజినేయులు, జి.ఆర్. వెంకటేశులు, సుబ్రహ్మణ్యం, డా.వెంకమాంబ, ప్రభాకర్, కె.రామాంజినేయులు, డా.దేవన్న, మల్లికార్జున, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అక్కినేని నాగేశ్వరరావు కళాపురస్కారాలను అందుకున్న కళాకారులను అభినందిస్తున్న ప్రముఖులు కోటేశ్వరరావు, డా.సురేంద్రబాబు, జి.ఆర్.వెంకటేశులు తదితరులు

హొసపేటె మీదుగా రైళ్ల సేవలు విస్తరించాలి

హొసపేటె, న్యూస్‌టుడే: పర్యాటకంగా నానాటికీ అభివృద్ధి చెందుతున్న హొసపేటె మీదుగా మరిన్ని రైళ్ల సేవలను ప్రారంభించాలని రైల్వే స్టేషన్ సలహా సమితి సభ్యులు కోరారు. నైరుతి రైల్వే హుబ్బళ్లి విభాగం ఆధ్వర్యంలో గురువారం హొసపేటెలో ఏర్పాటు చేసిన రైల్వేస్టేషన్ సలహాసమితి సమావేశంలో వారు మాట్లాడారు. సమితి అధ్యక్షుడు వై.యమునేశ్, కార్యదర్శి కుడతిని మహేశ్ తదితరులు మాట్లాడుతూ ఐదు నెలల కిందట రద్దయిన బెళగావి - హైదరాబాద్ రైలును వెంటనే ప్రారంభించాలి. ఈ రైలు రద్దుతో కల్యాణ కర్ణాటక ప్రాంతం ప్రజలు మంత్రాలయం, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జనరల్ టికెట్ తీసుకున్న వారు అత్యవసర పరిస్థితుల్లో హంపీ ఎక్స్‌ప్రెస్ బండిలో స్లీపర్ కోచ్‌లో ప్రయాణించే వెసలుబాటు ఉండేది. ఆ సౌకర్యాన్ని ఇటీవలే రద్దు చేశారని వాపోయారు. హుబ్బళ్లి - గుంతకల్లు రైలు రోజూ ఆలస్యంగా రాకపోకలు చేస్తోందని తెలిపారు. అధికారి శ్రీనివాస్ మేట్లా మాట్లాడుతూ విడతలవారీగా సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రముఖులు ప్రభాకర్, కౌతాళ్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ సలహా సమితి సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

ఇంత ఒత్తిడిలో పనులు చేయలేం

సింధనూరు, న్యూస్‌టుడే: ఒకటీ..రెండూ కాదు 50 యాప్‌లలో రోజూ అభివృద్ధి నివేదికలను చరవాణిలో నిత్యం పంపుతుండాలంటే..అయ్యేపని కాదు, పని ఒత్తిళ్లతో మా ఆరోగ్యాలు ఏమైపోతాయో అర్థం కావట్లేదు..మా పరిస్థితి ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతూ సింధనూరులో గురువారం నుంచి గ్రామ పాలనాధికారులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. స్థానిక మినీ విధానసౌధ ఎదుట బైఠాయించి చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసనలో పాల్గొన్నారు.తక్షణం మాకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు.

దర్శన్‌ను విచారించిన ఆదాయపన్ను శాఖాధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: చిత్రదుర్గం జిల్లాకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో బళ్లారి కేంద్ర కారాగారంలో ఉన్న నిందితుడు, సినీ నటుడు దర్శన్‌ను ఆదాయపన్ను శాఖాధికారులు గురువారం జైల్లో విచారించారు. రేణుకా స్వామిని హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని తరలించడానికి దర్శన్ పెద్ద మొత్తంలో నగదు ఖర్చు చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో ఆదాయ పన్నుశాఖాధికారులు బెంగళూరు నుంచి బళ్లారి జైలుకు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు జైలు ముఖ్య అధికారి సమీపంలో ఓగదిలో దర్శన్‌ను విచారణ చేపట్టారు. సాయంత్రం 7.30 గంటల వరకు విచారణ కొనసాగింది. ఆదాయపన్ను శాఖాధికారులు అడిగిన పలు ప్రశ్నలకు దర్శన్ సమాధానం చెప్పి, వారితో సహకరించినట్లు జైలు అధికారులు తెలియజేశారు. విచారణ సమయంలో పలు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వెంట వచ్చిన దర్శన్ లెక్క అధికారి (సీఏ) మధ్యలో పత్రాలు చూపించారు. సినీ నటుడు దర్శన్ నటిస్తున్న 'డెవిల్' చిత్రం నిర్మాత జె.బి.ప్రకాశ్, సునీల్‌కుమార్, శ్రీనివాస్‌లు విచారణ మధ్యలో దర్శన్‌తో కలవడానికి వచ్చారు. విచారణ సందర్భంలో ఆదాయ పన్ను శాఖాధికారులు మధ్యలో 25 నిమిషాల పాటు వారిలో కలవడానికి అవకాశం కల్పించారు.



దర్శన్‌ను కలవడానికి వెళ్తున్న నిర్మాత ప్రకాష్ తదితరులు

విదేశీ విద్యాలయాలతో ఒప్పందం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రావ్ బహద్దూర్ వై.మహాబలేశ్వరప్ప సాంకేతిక విద్యాలయంతో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలకు చెందిన విద్యాలయాలతో ఒప్పందం చేసుకున్నారు. ఆస్ట్రేలియా, కెనడా కేఫ్ బ్రిటన్ విశ్వవిద్యాలయం ముఖ్య కార్యనిర్వహణాధికారి యునస్ జూలీ, అంతర్జాతీయ నియామక సలహాదారు అకాలి ఫుల్మర్ బళ్లారి రావ్ బహద్దూర్ వై.మహాబలేశ్వరప్ప సాంకేతిక విద్యాలయానికి చేరుకున్నారు. కళాశాల అధ్యక్షుడు జానెకుంటె బసవరాజు, వి.వి.సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు, కార్యదర్శి డా.అరవింద్ పాటేల్, ప్రధాన ఆచార్యుడు డా.హనమంతరెడ్డి సమక్షంలో సమావేశమై కళాశాలను పరిశీలించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆసక్తి గల విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రవేశాలు, విదేశీ విద్యాలయాల్లో పరిశోధన, పరిపాలన విషయాలపై అధ్యాపకులు, సిబ్బందికి తెలుసుకోవడం, సెమినార్, సమ్మేళనం ద్వారా జ్ఞానం పొందడం, పరిశ్రమల నిర్వహణపై శిక్షణ వంటి అంశాలపై ఒప్పందాలు చేసుకున్నారు. వి.వి. సంఘం సభ్యులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యులతో వి.వి.సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు, ప్రధాన ఆచార్యుడు డా.హనుమంతరెడ్డి, వి.వి.సంఘం సభ్యులు

గని బాధిత ప్రాంతాల అభివృద్ధిపై శ్రద్ధేది?



మాట్లాడుతున్న సమాజ పరివర్తన అధ్యక్షుడు ఎస్.ఆర్.హిరేమఠ్, చిత్రంలో చాగనూరు మల్లికార్జునరెడ్డి, శ్రీశైల తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: గనులు తవ్వకాలతో నష్టపోయిన పరిసరాల అభివృద్ధి, గని బాధిత ప్రాంతాల అభివృద్ధికే కేఎంఈఆర్‌సీ నిధులను ఖర్చు చేయాలని సమాజ పరివర్తన అధ్యక్షుడు ఎస్.ఆర్.హిరేమఠ్ తెలిపారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి సంపద ముడి ఇనుప ఖనిజం తవ్వకాలతో చెల్లిస్తున్న రాయల్టీని అదే ప్రాంతాల్లో పరిసరాల పునశ్చేతనం, ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒడిశా, గోవా రాష్ట్రాల్లో మాదిరిగానే కర్ణాటకలో గనుల తవ్వకాలతో చెల్లిస్తున్న రాయల్టీని గనులు తవ్వకాలతో పాడై పోతున్న పరిసరాలను బాగు చేయడం, గని బాధిత ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ఖర్చు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించిందన్నారు. ప్రజాప్రతినిధుల సమక్షంలో నిధులు ఖర్చుచేయాలని ప్రయత్నాలు చేస్తుండగా, మరోసారి సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకుని వెళ్లడంతో దీన్ని తప్పు పట్టింది. ప్రత్యేకంగా ఓవర్ సైట్ అథారిటీ ఏర్పాటు చేసి అధ్యక్షులుగా విశ్రాంత న్యాయమూర్తి సుదర్శనరెడ్డిని నియమించినట్లు తెలిపారు.

రూ.32 వేల కోట్లున్నాయి

రాష్ట్రంలో ఉమ్మడి బళ్లారి జిల్లాతో పాటు చిత్రదుర్గం, తుమకూరు జిల్లాల్లో గని బాధిత 283 గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిసరాలు అభివృద్ధిపై నివేదికను న్యాయస్థానం ముందు ఉంచినట్లు ఎస్.ఆర్.హిరేమఠ్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

బళ్లారి అబ్కారీ కమిషనర్ మంజునాథ ఆదేశాలతో ఆ శాఖాధికారులు దిలీప్‌సింగ్ బి. ఠాకూర్, గిరీశ్, అబ్దుల్ వాహ బళ్లారి నగర శివారు ప్రాంతమైన బెంగళూరు పారిశ్రామిక ప్రాంతంలో వాహనాలు తనిఖీలో రూ.25వేలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి నగరం కమ్మింగ్ రహదారిలో నివాసముంటున్న మహమ్మద్ రఫీక్‌ను అరెస్టు చేసి విచారణ అనంతరం ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. **- న్యూస్‌టుడే, బళ్లారి**



యత్నాళ్ నోటికి తాళం వేయండి



సింధనూరులో యత్నాళ్‌కు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న యువకులు

సింధనూరు, న్యూస్‌టుడే: నోటికి హద్దూ.. అదుపూ లేకుండా వ్యాఖ్యలు చేస్తూ ప్రజల్లో విభేదాలు సృష్టిస్తున్న భాజపా ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని, ఆయన శాసనసభ సభ్యత్వం రద్దు చేసి బర్తరఫ్ చేయాలని కోరుతూ సింధనూరులో దళిత, వెనుకబడిన వర్గాలు, ముస్లిం అల్పసంఖ్యాత యువకులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక ఐబీ నుంచి నినాదాలతో..ప్లకార్డులు ప్రదర్శించి మినీ విధానసౌధ వరకూ నడిచారు. ముదోళ సభలో యత్నాళ్ స్వాతంత్ర్య సమరయోధుడు టిప్పు సుల్తాన్‌పై అవహేళనకర వ్యాఖ్యలు చేయడం సహించరాని నేరమని దుయ్యబట్టారు. తక్షణం ఆయన నోటికి తాళం పడాలంటే ఎమ్మెల్యేగా సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా


హ్యాండ్‌బాల్‌లో విజేతగా నిలిచిన క్రీడాకారులతో అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా పదవీ పూర్వ శిక్షణశాఖ ఆధ్వర్యంలో గురువారం బెస్ట్ పదవీ పూర్వ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో బళ్లారి బెస్ట్ పదవీ పూర్వ కళాశాల జట్టు గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. విజేత జట్టును కళాశాల ఛైర్మన్ కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు తిలక్‌కుమార్, కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, ప్రధాన ఆచార్యుడు వెంకటేశ్వర్‌రావు తదితరులు అభినందించారు.

మునిరత్నపై చర్యలకు డిమాండ్


నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల సభ్యులు

బళ్లారి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనలో రిజర్వేషన్లు వ్యతిరేకంగా మాట్లాడినట్లు భాజపా, జేడీఎస్ ఆరోపణలు చేయడం సరికాదని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. భాజపా ఎమ్మెల్యే మునిరత్న కులదూషణ చేయడం, బెదిరింపులు, అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మునిరత్నను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. దళిత సంఘం సంచాలకులు ఎ.మానయ్య, సభ్యులు గంగప్ప, దేవదాసు, అంజనేయ, మల్లయ్య, రమేష్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి


మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ప్రతినిధులు

కంప్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజనాధికారి హాలప్ప సూచించారు. తాలూకాలోని ఎమ్మిగనూరు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సంకల్ప కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ధర్మస్థల గ్రామాభివృద్ధి చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయుడు బి.ఎస్.సద్యోజాతప్ప మాట్లాడారు. ధర్మస్థల యోజన ప్రతినిధులు మంజునాథ, శశికుమార్, జీపీ సభ్యుడు లోకేశ్, ఎస్.రామప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌కు ఘననివాళి


విద్యాసాగర్ జయంతిలో పాల్గొన్న ఏఐడీఎస్‌వో విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈరణ్ణ విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి ఏఐడీఎస్‌వో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం మానవతావాది ఈశ్వరచంద్ర విద్యాసాగర్ జయంతిని బళ్లారి బీఎంసీ ఆర్‌సీ క్రీడామైదానం, ఐటీఐ కళాశాల క్రీడామైదానం, వార్డు కళాశాలలో వేర్వేరుగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఈరణ్ణ నేతృత్వంలో పలువురు విద్యార్థులు తదితరులు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 150 ఏళ్ల క్రితమే ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఉన్నత విద్య పురుషులకే పరిమితం కాదు. మహిళలు కూడా ఉన్నత విద్యాభ్యాసం చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతని పోరాటం చేయడమే కాకుండా మహిళలకు అవగాహన కల్పించారని తెలిపారు. నేడు విద్యార్థులు ఆయన మార్గదర్శనంలో ముందుకు వెళ్లాలన్నారు. సభ్యులు శాంతి, రాధా, మహ్మద్, సురేశ్‌బాబు, ఆంథోని విద్యార్థులు పాల్గొన్నారు.

శిశువులకు పౌష్టికాహారం అందించాలి


అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కంప్లి, న్యూస్‌టుడే: శిశువులకు పౌష్టికాహారం అందించాలని కంప్లి తహసీల్దార్ శివరాజ్ తల్లులకు సూచించారు. కంప్లిలో పోషక్ మాసాచరణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిశువుల ఆరోగ్యం కోసం గర్భిణులు సైతం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శిశువులకు అన్న ప్రాసన, గర్భిణులకు సీమంత కార్యక్రమం నిర్వహించారు. పురసభ ముఖ్యాధికారి దురుగణ్ణ, తాలూకా పంచాయతీ సహాయ నిర్దేశకుడు మల్లన గౌడ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లతీఫా బేగం పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల దుకాణాలపై దాడులు


కొప్పళలో పొగాకు ఉత్పత్తులు అమ్మే దుకాణాలపై దాడులు చేస్తున్న అధికారులు

గంగావతి, న్యూస్‌టుడే: కొప్పళలో పొగాకు ఉత్పత్తులను అమ్మే దుకాణాలపై అధికారులు గురువారం దాడులు చేశారు. పొగాకు రహిత అభియాన్ 2.0 కింద పాలనాధికారి నళిన్ అతుల్ ఆదేశం మేరకు ఈ దాడులు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో దాడులు చేసి 21 కేసులు నమోదు చేశారు. రూ.3500 జరిమానా వసూలు చేశారు. దాడుల్లో పొగాకు నియంత్రణ శాఖకు చెందిన నాగేంద్ర, పోలీస్, నగరసభ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన తప్పనిసరి

మాన్వి, న్యూస్‌టుడే: కార్మికులు తమ హక్కులతో పాటు కార్మిక చట్టాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ పాటిల్ అన్నారు. తాలూకా న్యాయవాదుల సంఘం, అధికార యంత్రాంగం, కానూను సేవ సమితుల ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ సభాంగణంలో కార్మికులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల సమస్యలు, పేదరికం నిర్మూలన, యోజనల అమలుపై కార్యశాల నిర్వహించారు.

ఆస్తులు పదిలం.. రాబడి మార్గం

● ఆస్తి కనజ్ సాఫ్ట్‌వేర్ అమలుపై నిర్లక్ష్యం ● ఆసక్తి చూపని పాలికె, ప్రజలు


బళ్లారి నగర పాలికె కార్యాలయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె పరిధిలోకి వచ్చే వివిధ రకాల ఆస్తులను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆస్తి కనజ్'కు పత్రాలు అందించేందుకు నగర వాసులు ఆసక్తి చూపడం లేదు. ప్రజల ఆస్తుల రక్షణకు రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం నిర్లక్ష్యానికి గురైంది. నగర పాలికె అధీనంలోకి వచ్చే భవనాలు, వాణిజ్య భవనాలు, ఖాళీ ఇంటి స్థలాలు డిజిటలైజేషన్ కోసం అసెట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. నగర పాలికె, తదితర స్థానిక సంస్థల ఆస్తులన్నింటినీ ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. అసెట్ బీన్ సాఫ్ట్‌వేర్‌లో ఆస్తి పత్రాలను నమోదు చేయడం తప్పనిసరైంది.

నగర పాలికెలో 1.30 లక్షల ఆస్తులు

బళ్లారి నగర పాలికె పరిధిలో ఇప్పటి వరకు 1,25,795 ఆస్తులు (నివాస, వాణిజ్య, పారిశ్రామిక, ఖాళీ స్థలాలు) ఉన్నాయని పాలికె అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దాని ప్రకారమే నగర పాలికె పన్నులు చెల్లిస్తున్నారు. అనంతరం నగర పాలికె బిల్ కలెక్టర్లు సేకరించిన సమాచారాన్ని 'ఆస్తి కనజ్'లో సాఫ్ట్‌వేర్‌లో డిజిటలైజేషన్ చేయడంతో నగర పాలికెలో మొత్తం 1,30,457 ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నేటి వరకు

ఉపయోగాలెన్నెన్నో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆస్తి కనజ్ పథకం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆస్తులను డిజిటలైజేషన్ చేయడం వల్ల రికార్డులు భద్రంగా ఉంటాయి. అక్రమంగా దస్త్రావేజులు మార్చి భూములు, ఆస్తులను ఆక్రమించుకోవడం సాగిపోతోంది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేయడానికి అనుకూలంగా ఉంటుంది. ఆస్తులకు సంబంధించి సమస్యలు ఉంటే పరిష్కరించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఆస్తిని నమోదు చేసిన తర్వాత పి.ఎన్.ఆర్. నంబర్‌ను పొందవచ్చు. పి.ఐ.డి. నంబర్‌ను ఉపయోగించి ఆస్తి పన్ను చెల్లించవచ్చు. పత్రాలు తమ వద్ద తప్పిపోయినప్పుడు నగర పాలికె నుంచి పొందడానికి అనుకూలంగా ఉంటుందని ఉప కమిషనర్ బి.అబ్దుల్ రెహమాన్ ఖాన్ తెలిపారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో కావేరి డేటాతో 'ఆస్తి కనజ్'ను ఏర్పాటు చేసింది. అందువల్ల ఇక నుంచి అసెట్ అకౌంటెంట్‌కు డాక్యుమెంట్ ఇచ్చి ఫారం-2 పొందిన తర్వాతే రిజిస్ట్రేషన్ సాధ్యమవుతుంది.

నగరంలో ఆస్తి వివరాలు

క్రమ సంఖ్య	వివరాలు	అధీకృత	అనధికారిక	మొత్తం
1	వసతి	62,413	11,423	73836
2	వాణిజ్య	10,478	5,201	15,679
3	పరిశ్రమలు	83	265	348
4	ఖాళీ స్థలాలు	21,915	18,679	40,594
మొత్తం		94,889	35,568	1,30,457

24 వేల ఆస్తుల రికార్డులను మాత్రమే పరిశీలించి అప్ లోడ్ చేశారు. మరో 1.05 లక్షల మంది యజమానులు ఆస్తి పత్రాలు అందించాల్సి ఉందని అధికారులు తెలియజేస్తున్నారు. మిగిలిన ఆస్తుల రికార్డులను సేకరించడం నగర పాలికె అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. తమ ఆస్తులు ఏమవుతాయోనని కొందరైతే, పన్ను ఎక్కడ పెరుగుతుందోనని మరి కొందరు ఆందోళన చెందుతున్నారు. నగర పాలికె ఆస్తులను జప్తు చేస్తారని భయంతో ముందుకు రావడం లేదు.

పన్నుల చెల్లింపులో పారదర్శకత

గతంలో ఆస్తి పన్ను సవరణ అధికారులు చేతుల్లో ఉండేది. ప్రస్తుతం నిబంధనలు రావడంతో ఆస్తి కనజ్ లాంటి సాఫ్ట్‌వేర్ పద్ధతి అందుబాటులోకి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఆస్తి స్వభావం ఆధారంగా పన్ను మొత్తాన్ని యజమానికి తెలియజేస్తుంది. మీ ఆస్తి పన్ను గడువు తేదీ చరవాణి, ఇ-మెయిల్ ద్వారా సందేశం పంపుతుంది. ఆస్తి పన్ను చెల్లించడానికి కార్యాలయానికి వెళ్లే అవసరం లేదు. ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. పన్నులు చెల్లింపులో దళారులు, అధికారులు, సిబ్బంది జోక్యం ఉండదు.

పాలికెకు ఆదాయం పెరుగుతుంది

నగర పాలికె వ్యాప్తిలో 1,25,795 ఆస్తులకు పన్నులు చెల్లిస్తున్నారు. ఆస్తి కనజ్ డిజిటలైజేషన్ ప్రారంభమైన తర్వాత ప్రస్తుతం 1,30,457 ఆస్తులు ఉన్నాయి. గతంలో ఏడాదికి పన్నుల రూపంలో నగర పాలికెకు రూ.45 కోట్ల ఆదాయం వచ్చేది. నగరంలోని ఆస్తులను డిజిటలైజేషన్ చేస్తే రూ.100 నుంచి రూ.120 కోట్ల వరకు పన్నులు రూపంలో వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పన్నుల చెల్లింపునకు అనుకూలం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆస్తి కనజ్ సాఫ్ట్‌వేర్‌లో ఆస్తి పత్రాలు నమోదు చేసుకుంటే పన్నులు చెల్లించడానికి అనుకూలంగా ఉంది. ఇంట్లోనే కూర్చుని ఆస్తి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. ఇలా ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లిస్తే ఆదాయం పెరుగుతుంది. నగర పాలికెలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి అనుకూలంగా ఉంటుంది.

- ముల్లంగి నందీష్, మేయర్, బళ్లారి నగర పాలికె

నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలి



నగర పాలికె ప్రజలు అనుకూలం కోసం ఆస్తి కనజ్ సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ద్వారా నగర పాలికెలోని ఆస్తులను పూర్తిగా డిజిటలైజేషన్ చేసుకోవాలి. స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకుంటే ఆస్తులకు భద్రతతో పాటు, పన్నులు చెల్లించడానికి వీలవుతుంది.

- ఖలీల్‌సాబ్, నగర పాలికె కమిషనర్

ప్రజల ఆస్తులకు రక్షణ



ఆస్తి కనజ్‌లో ఆస్తుల పత్రాలను డిజిటలైజేషన్ చేసుకుంటే ఆస్తులకు భద్రత ఉంటుంది. ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఆస్తి పత్రాలు సమర్పించడం ఎలాంటి తొందర ఉండదు. ఆస్తి పత్రాలను డిజిటలైజేషన్ చేసుకోవడం వల్ల ఫారం-2 పొందవచ్చు. ఆస్తులను విక్రయించుకోవడానికి ఇబ్బందులు ఉండవు.

- బి.అబ్దుల్ రెహమాన్, బళ్లారి నగర పాలికె ఉప కమిషనర్

రైతుల సహకారంతో లక్ష్యాన్ని సాధించాం


సాధించిన స్మరణికలతో బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న నిర్దేశకులు, ఉద్యోగులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: రైతులు, బ్యాంకు పరిపాలన అధికారులు, సిబ్బంది సహకారంతో పీఎల్‌డీ బ్యాంకు రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో నిలిచిందని బ్యాంకు అధ్యక్షుడు చొక్కా బసవన గౌడ పేర్కొన్నారు. ప్రాథమిక సహకార కృషి గ్రామీణ అభివృద్ధి (పీఎల్‌డీ) బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో సాధించిన ప్రగతికి కృషి చేసిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు చొక్కా బసవన గౌడ మాట్లాడుతూ బ్యాంకు ప్రారంభించి 63 సంవత్సరాలు కావస్తోంది, నాటి నుంచి రైతులకు రుణాల పంపిణీ, వసూలు చేస్తూ అనేక మార్పులు చేసుకుంటూ ఖాతాదారుల సేవలే పరమావధిగా పనిచేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం 96.51 శాతం వసూళ్లతో రూ.1.67 కోట్ల లాభం సాధించి, రాష్ట్ర స్థాయిలో 183 బ్యాంకుల్లో తమ బ్యాంకు అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు మల్లయ్య, నిర్దేశకులు జడేస్వామి, తిమ్మప్ప, శివరుద్రగౌడ, మల్లికార్జున గౌడ, బ్యాంకు బ్యానేజర్ తిప్పణ్ణ పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి


నగర పాలికె అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సోమశేఖర్‌గౌడ, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని నాగరిక, పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నగర పాలికె అధికారి మల్లన గౌడకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమశేఖరగౌడ మాట్లాడుతూ రెండు నెలలు ముందు సమస్యలపై నగర మేయర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించాం. వాటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. సత్యనారాయణ పేటె భూగర్భ వంతెనలో వర్షపు నీరు నిలబడకుండా చూడాలి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని నివారించాలి. నగర వాసులు విషజ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నాయి. తక్షణమే దోమలు నివారణకు ఫాగింగ్ చేయించాలని కోరారు. దుర్గమ్మ దేవస్థానం సమీపంలోని భూగర్భ వంతెనలో ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేయాలి. నగరంలో పలు రహదారులు గుంతలు పడ్డాయి. కంకర తేలాయి. కనీసం పూర్తి స్థాయిలో రహదారిని వేయడానికి ముందు గుంతలను పూడ్చి వేయాలని కోరారు.

సమస్యలపై గ్రామాధికారుల నిరసన

మాన్వి, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ శాఖ అభివృద్ధి చేసిన 17 పైగా వెబ్ సాంకేతిక తంత్రజ్ఞానం అమల్లో సమస్యలు వస్తున్నాయని, వాటిని పరిష్కరించి తగిన వసతులు కల్పించాలంటూ గురువారం కర్ణాటక గ్రామ పాలనాధికారుల సంఘం సభ్యులు మాన్వి, సిరివార, లింగసుగూరుల్లో ధర్నాలు చేశారు. మాన్విలో ఎమ్మెల్యే భవనం, సిరివారలో తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. విధుల నిర్వహణకు సరైన సదుపాయాలు లేవన్నారు. అన్ని తంత్రాంశాలనూ నిక్షిప్తం చేసుకునే చరవాణులు, స్కానర్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు లేకుండా విధులు నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. సాంకేతిక సమస్యలతో వినియోగదారులకు సకాలంలో సేవలు అందించలేదని పరిస్థితి నెలకొందన్నారు. కింది అధికారులకు తాకీదులు జారీ చేయడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు పెంచాలని కోరారు. ఆందోళనలో సంఘం తాలూకా శాఖ అధ్యక్షుడు హనుమంతప్ప జెల్లి, సిరివార మాజీ అధ్యక్షుడు అయ్యనగౌడ, ఉప తహసీల్దార్లు వినాయకరావు, విరుపణ్ణ, వాసవి, సిద్ధనగౌడ, ఆర్ఐ శ్రీనాథ్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సంగమేష్, తదితరులున్నారు.


ఎమ్మెల్యే భవనం వద్ద ధర్నా చేస్తున్న గ్రామాధికారులు

గ్రహణం మొర్రి శాపం కాదు

గంగావతి: గ్రహణం మొర్రి శాపం కాదు, శస్త్ర చికిత్సతో దీన్ని నయం చేయొచ్చని వైద్యాధికారి రాజశేఖర్ వస్త్రద్ పేర్కొన్నారు. గంగావతి ఉప విభాగ ఆసుపత్రిలో ఆయన గురువారం గ్రహణం మొర్రి అవగాహనా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రహణం మొర్రితో పుట్టిన బిడ్డకు ఐదు నెలల్లో శస్త్రచికిత్స చేయిస్తే అందరిలా ఉండే అవకాశం ఉందన్నారు. 18 సంవత్సరాల్లోపు అందరికీ ఉచితంగా శస్త్రచికిత్స చేస్తామన్నారు. వైద్యులు చేతనా, రాధికా, కీర్తిరాణి, రేఖా, శ్రీదేవి, కావ్య, డి.సంతోష్ పాల్గొన్నారు.


గ్రహణం మొర్రి అవగాహనా శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు రాజశేఖర్


బళ్లార్పి జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు


సిరుగుప్ప: గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మకు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు, సభ్యులు


కంప్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పాలనాధికారులు

గ్రామపంచాయతీ అధికారుల ఆందోళనబాట

బళ్లారి, న్యూస్‌టుడే: మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ రాష్ట్ర గ్రామ పరిపాలన అధికారుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ పరిపాలన అధికారులు ఆందోళన నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా పాలనాధికారి కార్యాలయ అధికారికి అందించారు. గ్రామ పంచాయతీ పరిపాలన అధికారి, సాంకేతిక అధికారి అందజేస్తున్న వేతనంతో పాటు శ్రేణి కల్పించాలి, సౌకర్యాలతో కూడిన కార్యాలయం సిద్ధం చేయాలన్నారు. 10 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వివిధ గ్రామ పంచాయతీల అధికారులు పాల్గొన్నారు.

సిరుగుప్ప: విధి నిర్వహణలో ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల పట్టీలు ధరించి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా, తాలూకా అధ్యక్షుడు రామప్ప, విరుపాక్షప్ప మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలాగా ఉండి ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులతో పాటు ప్రజల సమస్య పరిష్కరించేందుకు పగలు రాత్రి తేడా లేకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ వినతిపత్రం గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మకు అందించారు. వీరికి మద్దతుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లింగరాజ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు హుచ్చీరప్ప, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంప్లి: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ పాలనాధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. గ్రామ పాలనాధికారుల సంఘం నాయకులు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రామాల్లో అన్ని సదుపాయాలతో కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించారు. తాలూకాలోని అన్ని గ్రామాల గ్రామ పాలనాధికారులు పాల్గొన్నారు.

కారటగి: వివిధ సమస్యల పరిష్కారం కోసం తాలూకా గ్రామ పాలనాధికారులు కారటగి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.కుమారస్వామికి వినతిపత్రం సమర్పించారు. తాలూకాలోని అన్ని గ్రామాల పాలనాధికారులు పాల్గొన్నారు.

గంగావతి: తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ పరిపాలనా అధికారులు (వీఏవో)లు గురువారం గంగావతిలో దీక్ష చేశారు.. సంఘం అధ్యక్షుడు ఆర్.సి.రాఘవేంద్ర మాట్లాడుతూ తమకు మౌలిక వసతులు కలిగిన కార్యాలయాల సదుపాయం కల్పించాల్నారు. చరవాణి సాంకేతికత పథకాలకు సంబంధించి ఇప్పటి దాకా చేసిన సస్పెన్షన్లను ఉపసంహరించుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎస్‌డీసీ, ఎఫ్‌డీసీ గుమస్తా ఉద్యోగాలకు తమకు పదోన్నతి కల్పించాలన్నారు. ఆందోళనలో సంఘం ప్రతినిధులు సురేశ్ మలపనగుడి, ప్రియాంకా గంజి, నాగబిందు, మంజునాథ్ దుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.


గంగావతిలో దీక్ష చేస్తున్న వీఏవోలు


కారటగిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామ పాలనాధికారులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

26-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.84	1619.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,368	1,524
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	12,033	9,620
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.148	59,148
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగులు

హొసపేటెలో జాతీయ నిరసన దినాచరణ

హొసపేటె: ఉద్యోగులపై ప్రభుత్వం చూపుతున్న చిన్నచూపు, నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ నిరసన దినాచరణ సందర్భంగా ఉద్యోగులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన జంబయ్యనాయక, తాయప్ప నాయక, నాగరాజ్ పత్తార్ మాట్లాడుతూ ఉద్యోగుల నుంచి ప్రభుత్వ వెట్టిచాకిరీ చేయించుకుంటోంది తప్ప, తగిన సౌకర్యాలు కల్పించడంలేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పనులు చేస్తున్నా, ఇద్దరి నడుమ జీతభత్యాల్లో చాలా తేడాలు ఉన్నాయని వాపోయారు. కొత్త పింఛను పథకాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛను పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ప్రగతి మంత్రం..



కన్నడనాట ఆమూలాగ్రం పర్యాటక ప్రాంతాల సమాహారంతో విరాజిల్లుతోంది. ఎటుచూసినా దర్శనీయ స్థలాలే. ఎన్నెన్నో అందాల పుంతలు కానవస్తాయి. రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం తాజాగా ప్రత్యేక పథకాన్నీ అమలు చేస్తోంది. చారిత్రక స్మారకాల దత్తత కార్యక్రమం, కీలక ప్రాంతాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో వసతుల విస్తరణ తదితరాలు ఇందులో భాగమే. ప్రత్యేకించి తీర ప్రాంత పర్యాటకాన్ని అటు కేరళ- ఇటు గోవాతో పోటీపడి విస్తరించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. లెక్కలేనన్ని తీరాలను చక్కగా తీర్చిదిద్దితే అదే ఆర్థికవనరుగా మారుతుందని అంచనా వేస్తున్నారు. సాహస- ఆధ్యాత్మిక- సాగర- ఉద్యాననగరి- నదీనదాల ఆధారంగా జలవేదికల విహారాలను అభివృద్ధి చేయడం ద్వారా దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవాలనేది సర్కారు లక్ష్యం. విహారాన్ని ఐదింటిగా విభజించి.. ఎక్కడికక్కడ వసతులు విస్తరించదలిచారు. ఈ 'పంచ'రత్నాలు.. వనరుల ఉద్దీపనలుగా భావిస్తున్నారు. ఆ వివరాల సమగ్ర విశ్లేషణాంశాలు నేడు 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా.. ఈనాడు పాఠకుల కోసం.. ఇక్కడ అందిస్తున్నాం. తాజా పర్యాటక దినోత్సవాన్ని 'శాంతి'సాధనకు ప్రత్యేకించడం ప్రస్తావనార్హం. వివిధ విహారాల సాయంతో శాంతియుత జీవనానికి బాటలు వేయాలనేది నిపుణుల సంకల్పం.

ఆలయ శిఖరం.. ఆధ్యాత్మిక వైభవం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: చందనసీమలో వేర్వేరు వాతావరణాలు, మట్టి తీరు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచరణలు ఆకట్టుకుంటాయి. అన్ని ప్రాంతాల ప్రజలను ఆలయ పర్యాటకం అనుసంధానం చేస్తోంది. హొయసళ, చాళుక్య, చోళ రాజుల పాలనలో పలు ఆలయాల నిర్మాణం పూర్తి చేయడం చరిత్ర. ఆలయాల నిర్మాణ శైలి ప్రతి ఒక్కరినీ అబ్బురపరిచేలా ఉండడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల సంఖ్య ఎక్కువే.



మేలుకోటె యోగనరసింహ స్వామి ఆలయ వైభవం

ఆలయాల సమీపానే భక్తులకు సదుపాయాలను మెరుగు పరచేందుకు ప్రైవేటు కంపెనీలతో పర్యాటక శాఖ ఇప్పటికే పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో ప్రసాదాన్ని నందిని నెయ్యితో తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం తాజా పరిణామం. కొన్ని ఆలయాల్లో నిత్యాన్నదాన పథకం కొనసాగుతోంది. ఉత్తర కన్నడ నుంచి చామరాజనగర వరకు, దక్షిణ కన్నడ నుంచి కోలారు వరకు ఉన్న 31 జిల్లాల్లో ఆలయాలకు వస్తున్న భక్తుల సంఖ్య ఏడాదిన్నరలో గణనీయంగా పెరిగింది. ఆర్టీసీలో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు 'శక్తి' పథకాన్ని అమలు చేసిన అనంతరం ఎక్కువ మంది భక్తిమార్గం పట్టి.. మొక్కులు తీర్చుకుంటున్నారు. వివిధ సన్నిధానాల్లో ఆలయాల హుండీ ఆదాయం రెట్టింపైంది. కర్ణాటక పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ పలు ఆలయాలు, పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు రూ.3 వేలతో ప్యాకేజీ టూరు వారం పాటు తిరిగి వచ్చేలా అందుబాటులోకి తీసుకువచ్చింది. శ్రీరంగపట్టణలోని రంగనాథ స్వామి ఆలయం, మండ్య- మధ్యరంగ, చామరాజనగర- మలె మహదేశ్వరుడు, మైసూరు- చాముండేశ్వరి, కొడగు- ఓంకారేశ్వరుడు, ధర్మస్థల- మంజునాథుడు, ఉడుపి- శ్రీకృష్ణ, కొల్లూరు- మూకాంబిక, కుక్కె- సుబ్రహ్మణ్య, కద్రి- మంజునాథుడు, హొరనాడు- అన్నపూర్ణేశ్వరి, పావగడ- శనీశ్వర స్వామి, మేలుకోటె- యోగా నరసింహస్వామి, చెలువరాయస్వామి, శృంగేరి- శారదామాత, బెంగళూరు- ఇస్కాన్, రాజరాజేశ్వరి, బనశంకరి, కాడు మల్లేశ్వర ఆలయాలు, కోలారు జిల్లా- కురుడుమలె, చిక్కబళ్లాపుర- భోగనందీశ్వర స్వామి, హంపీ విరూపాక్ష, సవదత్తి- రేణుకా యల్లమ్మ, గోకర్ణ- మహాబలేశ్వర ఆలయాలతో పాటు చిక్కబళ్లాపుర సమీపంలోని జగ్గీ వాసుదేవ ఫౌండేషన్ నిర్వహించే ఆదిదేవుని విగ్రహ ప్రాంగణం, కార్కళలోని పడు తిరుపతి, మాలూరు సమీప చిక్క తిరుపతికి వస్తున్న భక్త పర్యాటకుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.



ధర్మస్థల మంజునాథేశ్వరుడి కోవెల

మదినిండా.. నందికొండ!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఆకాశం నుంచి సన్నగా జాలువారే చినుకులు.. దట్టమైన పొగమంచు.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు నందికొండల దిశగా అడుగులు వేసే ప్రకృతి ప్రేమికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వారాంతపు సెలవు రోజుల్లో యువత ద్విచక్రవాహనాలపై ఈ కొండ బాటపడుతున్నారు. కొండపై నిలబడి సూర్యోదయాన్ని తిలకించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. తెల్లవారుజాము నుంచే ఇక్కడ సందడి జోరందుకుంటోంది. బెంగళూరు నగరానికి 60 కిలోమీటర్ల దూరంలో ఈ గిరిధామం విరాజిల్లుతోంది. కొండపైకి ప్రైవేట్ ట్యాక్సీలతో పాటు బస్సు సౌకర్యం ఉండటంతో ప్రకృతి అందాలను తిలకించేవారి సంఖ్య ఎక్కువే. వారి కోసం నందిగిరి ధామ సమగ్రాభివృద్ధి నిర్వహణ సమితి ఆధ్వర్యంలో పలు సేవలు విస్తరిస్తున్నారు. తెల్లవారుజాము ఐదుగంటల నుంచి సాయంత్రం ఏడుగంటల వరకు కొండను సందర్శించవచ్చు. అత్యధికులు పైనుంచి సూర్యోదయాన్ని తిలకించేందుకు ఇష్టపడతారు. సూర్యోదయాన్ని తిలకించి.. పగలంతా విహరించి వెనుతిరుగుతుంటారు.



నందికొండల చక్కని నిండుదనం



తెలతెలవారగనే.. గిరిధామంపై పర్యాటకుల సందడి

పర్యాటక పంచతంత్రం!

హాయి.. హాయిగా సాగిపోదామా

మంగళూరు, న్యూస్‌టుడే: దక్షిణ కన్నడ నుంచి ఉత్తర కన్నడ జిల్లా వరకు 320 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం పర్యాటకులను రా.. రమ్మని పిలుస్తోంది. తీర పర్యాటకంతో పాటు, జలపాతాలు, నదుల వద్దకు వెళుతున్న ఔత్సాహికుల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది. గోకర్ణలోని ఓం బీచ్, కాపు తీరంలో దీపస్తంభం, ఉడుపి సమీపంలోని సెయింట్ మేరీస్ ద్వీపం, ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర నుంచి కార్వార వరకు వెనుక జలాల అందాలు వేటికవే ప్రత్యేకం. గోకర్ణలోని ఓం ఆకారంలో ఉండే తీరం, కుమట వద్ద ఉప్పు తయారీ కయ్యలు, ఓ వైపు నది- మరో పక్క సముద్రం.. మధ్యలో జాతీయ రహదారి కొనసాగే మరవంతె ప్రాంతం అద్భుతమే. వీటితో పాటు కోడి, మల్పె, డెల్టా, మట్టు తీరాలకు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. కేఆర్ఎస్ వద్ద బృందావన్ గార్డెన్, తుంగభద్ర జలాశయం, ఆలమట్టి జలాశయం, భారతదేశ పటాన్ని తలపించే చిత్రదుర్గ వాణివిలాస జలాశయాలలో నీరు ఉన్న సమయంలో పర్యాటకులకు వస్తుంటారు. వర్షాకాలంలో శరావతి నది నుంచి జన్మించిన జోగ్ జలపాతం, గోకాక, హెబ్బె, అబ్బె, మగోడ్, ఇరుప్పు, బన్నెహొలె, దబ్బె, శతొడ్డి, బర్కణ తదితర 35 జలపాతాలకు వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. గోవా, కర్ణాటక సరిహద్దులోని దూద్‌సాగర్, బాళెహొన్నూరు సమీపంలో అడవుల నడుమ సిరిగెరె జలపాతాలకు కూడా పర్యాటకులు పోటెత్తుతున్నారు. గగనచుక్కి, భర చుక్కి జలపాతాలను రాత్రి లేజర్ కాంతుల వెలుగులో వీక్షించేందుకు ప్రభుత్వం జలపాతోత్సవాలను నిర్వహిస్తోంది. జోగ్ జలపాతాన్ని పై నుంచి కింద వరకు చూసుకుంటూ వెళ్లేందుకు భారీ లిఫ్టు, గోకాక జలపాతంపై నడిచి వెళ్లేందుకు మందపాటి గాజుతో చేసిన వంతెన నిర్మాణాలకు ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనుంది. బృందావన్ గార్డెన్స్‌ను డిస్నీ వరల్డ్ తరహాలో విస్తరించేందుకు ప్రణాళికలను రూపొందించింది. మురుడేశ్వర తీరంలో జలక్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఇతర తీరాల్లోనూ వీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పలు ప్రైవేటు సంస్థలు ముందుకు వచ్చాయి. బీచ్ రిసార్టులు, హోంస్టేలు, బ్యాక్ వాటర్‌లో రాత్రి గడిపేందుకు బోట్ హౌస్‌లు ఆకట్టుకునే అంశాలు. నంజనగూడు సమీపంలో కబిని నదిపై 1735లో దళవాయి దేవరాజు నిర్మించిన వంతెనను చూసేందుకు ఎంతో అపూర్వమనిపిస్తుంది. రాయి, ఇసుక, కోడిగుడ్డు సొన, సున్నం, మైదా తదితరాలను ఉపయోగించి 56 స్తంభాలతో నిర్మించిన ఈ వంతెన ఎనిమిది అడుగుల వెడల్పుతో ఉంటుంది. దీనిపై 1902 వరకు ఎడ్ల బండ్లు వెళ్లేవి. అనంతరం న్యారో గేజ్ వేసి రైలును నడిపారు. కొత్త వంతెన నిర్మాణం అనంతరం గత 17 ఏళ్లుగా ఈ వంతెనను పర్యాటకుల వీక్షణ కోసం ఉంచారు.



జోగ్ జలపాతం.. కనులకింపైన విహార సంకేతం



హొన్నావర- కార్వార మధ్య ప్రయాణమార్గాలే ప్రమోదం

సాహసమే ఊపిరిగా!



దాండేలి సమీపంలో కాళీ నదిలో రివర్ ర్యాఫ్టింగ్

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: 'కాంతార' సినిమా విడుదలైన అనంతరం దేశంలోని అన్ని ప్రాంతాల వారికి కంబళ క్రీడ అంటే ఏమిటో తెలుసుకునేందుకు అవకాశం కలిగింది. కంబళను వీక్షించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు మంగళూరు, ఉడుపి జిల్లాలకు సీజన్‌లో వస్తున్నారు. తక్కువ సమయంలో దున్నపోతుల జంటను దమ్ము చేసిన పొలంలో పరుగు పెట్టించడంలో ఇటీవలి కాలంలో సరికొత్త రికార్డులను క్రీడాకారులు నెలకొల్పారు. సాహసాలు చేసేందుకు ఆసక్తి ఉన్న వారికి దాండేలి వద్ద కాళీ నదిలో రివర్ ర్యాఫ్టింగ్ పోటీలు క్రమం తప్పకుండా కొనసాగుతుంటాయి. దుబారె సమీపాన కావేరి నదిలోనూ రివర్ ర్యాఫ్టింగ్, సొంతంగా తెడ్లు వేసుకుని బోట్లు నడుపుకొనేందుకు అవకాశాన్ని కల్పించారు. కొడగు, దక్షిణ కన్నడ జిల్లాల్లో బురద కొయ్యల్లో నిర్వహించే ఆటల పోటీలకూ చక్కని స్పందన లభిస్తోంది. కొడగు, చిక్కమగళూరుల్లోని ఎత్తైన శిఖరాలపైకి ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు ఎక్కువయ్యారు. ఇటీవలి కాలంలో బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర, రామనగర, చామరాజనగర, మైసూరు, తుమకూరు జిల్లాల పరిధి కొండలపైకి వారాంతంలో ట్రెక్కింగ్‌కు వెళుతున్నారు. సొంత వాహనాలతో పాటు బాడుగకు బైకులు, కార్లు తీసుకువెళ్లే అవకాశం ఉండడంతో యువత, టెకీలు ఈ తరహా ట్రెక్కింగ్‌కు ఆసక్తి చూపిస్తున్నారు. 'దేశం తిరిగి చూడు. కోశాన్ని (గ్రంథాన్ని) చదివి చూడు' అనే నానుడికి తగినట్లు సాహస క్రీడలు, సాహస పర్యాటకానికి, బురదలో ఆటలు, కంబళ వీక్షణకు ఆదరణ పెరుగుతోంది. బెంగళూరు నుంచి వారాంతాల్లో నంది బెట్టకు వెళ్లి రావడం, బెంగళూరు నుంచి లేపాక్షి వరకు సూపర్ బైకులు, కార్లలో రేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. సాహస క్రీడలు, సంప్రదాయ, గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు పర్యాటక శాఖ, ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది.



కంబళ క్రీడలో దున్నపోతులను పరుగు పెట్టిస్తున్న క్రీడాకారుడు

చారిత్రక దీప్తి.. రాయల కీర్తి



ఏకశిలా రథం అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

హొసపేటె, న్యూస్‌టుడే : ఆరుబయలు పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన విజయనగర రాజధాని హంపీని దక్షిణ కాశీగా పిలుస్తారు. 42 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన హంపీలో కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు గుర్తించిన 200 స్మారకాలు ఉన్నాయి. అడుగడుగునా స్మారకాలు, గుడులు, గోపురాలు కలిగి ఉండటం విశేషం. హంపీ కేంద్రంగా హొసపేటె, సండూరు ప్రాంతాలు పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతున్నాయి.

- హంపీ పర్యాటక సీజన్ ఏటా అక్టోబరు నుంచి మార్చి వరకూ ఉంటుంది. ఆ వేళల్లో విజయనగర వీధులు దేశ, విదేశాల పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి. కనీసం 30 లక్షల మంది పర్యాటకులు ఏటా హంపీ వస్తారు. అందులో లక్ష మంది విదేశీయులుంటారు. ఐరోపా దేశాల నుంచి వచ్చేవారి సంఖ్య ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం రూ.50 నోటులో హంపీ రాతిరథం బొమ్మను ముద్రించడంతో హంపీ పేరును నలుదిశలా విస్తరించేలా చేసింది.
- రాయలేలిన ఈ చారిత్రక గడ్డను దేశవిదేశాల పర్యాటకులు సజీవ స్మారక ప్రాంతం (లివింగ్ మాన్యుమెంట్) అని పిలుస్తారు. 2008లో యునెస్కో హంపీని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చింది. ఇక్కడ త్రికాల పూజలందుకునే విరూపాక్షుడు కొలువుదీరాడు. పురాణ ప్రసిద్ధిచెందిన ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీ.. అంటూ కీర్తిస్తారు. హావేరి జిల్లా బనవాసి, హంపీలో మాత్రమే కన్నడ మాతా భువనేశ్వరి ఆలయాలు ఉండేది. కాముడి దహనం కూడా ఇక్కడే జరిగినట్లు స్కందపురాణంలో ప్రస్తావన ఉంది.



విహంగ వీక్షణలో హంపీ అందాలు



బెంగళూరు ప్యాలెస్ మైదానం.. ఆటపాటలకు నిలయం

ఉద్యానవనిలో బాలానందం!

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : దసరా, దీపావళి, సంక్రాంతి పండగలు, వేసవికాలంలో వచ్చే సెలవులకు బెంగళూరు పర్యటనలకు పర్యాటకులు వచ్చేస్తుంటారు. ఆరేళ్ల పిల్లల నుంచి టీనేజీ పూర్తి చేసుకున్న వారందరూ ఉద్యాననగరిలో వీక్షించేందుకు పలు ఆకర్షణలు ఉన్నాయి. బాలభవన్‌లో పుటాని ఎక్స్‌ప్రెస్, గుండ్రంగా తిరిగే కుర్చీలు, అక్వేరియం, ఆ పక్కనే కబ్బన్ ఉద్యానవనం, ఒకవైపు విధానసౌధ, మరోవైపు హైకోర్టు, రాజ్‌భవన్, ఆకాశవాణి కేంద్రం, ఇందిరాగాంధీ మ్యూజికల్ ఫౌంటెయిన్, జవహర్‌లాల్ తారాలయం, దుకాణాల సముదాయాలు, బెంగళూరులో అతి పెద్ద భవంతి వరల్డ్ ట్రేడ్ సెంటర్, మెట్రో రైలు, బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం, ఇస్కాన్ ఆలయం నిర్మాణ శైలి, ఫిడేల్ ఆకారంలో ఉండే చౌడయ్య స్మారక భవంతి, ఫన్ వరల్డ్, బెంగళూరు ప్యాలెస్, హలసూరు చెరువు, టిప్పు ప్యాలెస్, బెంగళూరు శివార్లలో వండర్‌లా, మైసూరు సమీపంలో ఓషన్ పార్క్, మైసూరు రోడ్డు విశ్వ ఒక్కలిగర సంస్థానంలోని పంచముఖ ఆంజనేయ స్వామి గుడి, కస్తూర్బా రోడ్డులోని విశ్వేశ్వరయ్య పారిశ్రామిక వస్తు సంగ్రహశాల, మారతహళ్లి శివుని ఆలయం, లాల్‌బాగ్.. ఇవన్నీ బాలలు, యువకులను ఆకట్టుకుంటాయి. ఉద్యాననగరిని చుట్టి వచ్చేందుకు కేఎస్‌టీడీసీ, బీఎంటీసీ ప్రత్యేక ప్యాకేజ్‌లను అందిస్తోంది. బెంగళూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో పర్యటించేందుకు కనీసం మూడు రోజుల సమయం పడుతుంది. ప్రైవేటు ట్రావెల్స్ కూడా ప్యాకేజ్‌లపై పర్యాటకులకు నగరం తిప్పి చూపిస్తుంది. బెంగళూరు పర్యటన పర్యాటకులకు జీవితకాలపు జ్ఞాపకాల అనుభవాలను అందిస్తుంది.



బాలలకు మనోరంజనానికి రివాల్వింగ్ కుర్చీలు



విహంగ వీక్షణలో విధానసౌధ, హైకోర్టు, కబ్బన్ ఉద్యానవనం



కబ్బన్ ఉద్యానవనంలో విరబూసే వృక్షరాజాలు

బాలల ఆరోగ్యానికి చక్కని ఆహారం

యాదగిరి, న్యూస్‌టుడే : విద్యార్థులకు వారంలో ఆరు రోజులు పౌష్టికాహారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. అరకెరా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికత నిండుగా ఉండేలా చూస్తున్నామని చెప్పారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఇప్పటికే బెంగళూరులో ప్రారంభించిన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నామని వివరించారు. వారంలో ఆరు రోజులు గుడ్లను ఇచ్చేందుకు ఫౌండేషన్ సహకరిస్తుందని, 57 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పాఠశాలలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో మంత్రులు శరణ బసప్ప దర్శనాపుర, ఎమ్మెల్యేలు శశీల్ నమోశి, చెన్నారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి రుద్రేశ్, విద్యాశాఖ అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర అక్రమాలు ఒక్కొక్కటీ త్వరలో బయటకు వస్తాయని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప హెచ్చరించారు. మీరు మద్దతు ఇస్తున్న కేంద్ర మంత్రి కుమారస్వామి, మీ తండ్రి యడియూరప్ప ఇద్దరూ బెయిలుపై బయట ఉన్న విషయాన్ని మర్చిపోయారా అని బుధవారం ఇక్కడ చురకలంటించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మధు బంగారప్ప

కుమారా.. మీ మాటేంటి?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : 'కుమారస్వామి గారూ.. మీ పదవికి రాజీనామా ఎప్పుడు చేస్తున్నారు' అంటూ కర్ణాటక కాంగ్రెస్ కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని ప్రశ్నించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటూ జనతాదళ్, భాజపా కార్యకర్తలు ధర్నా, నిరసన ప్రదర్శనలు చేస్తున్న నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్ తన ఎక్స్ హ్యాండిల్‌లో ట్వీట్ చేసింది. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో జరగని అక్రమాలను సిద్ధరామయ్యకు ఆపాదిస్తూ భాజపాతో కలిసి దళ్ పాదయాత్రలు చేసి, ఇప్పుడు సీఎం రాజీనామాను తాను కోరడం లేదని కుమార పేర్కొనడం హాస్యాస్పదమని ట్వీట్‌లో ఎద్దేవా చేసింది.

ఎక్కడికెళ్లినా సంకటమే..

మైసూరు, న్యూస్‌టుడే : సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లినా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వ్యతిరేకంగానే తీర్పు వస్తుందని ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్ వ్యాఖ్యానించారు. మైసూరు నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు వచ్చిన 14 ఇళ్ల స్థలాలను వెనక్కు ఇచ్చి, పదవికి రాజీనామా చేసి, విచారణకు హాజరు కావాలని హితవు పలికారు. ముడాలో అక్రమాలు జరిగాయని తాను మొదటి నుంచీ చెబుతూ వచ్చానని గుర్తు చేశారు.

ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులు

గదగ, న్యూస్‌టుడే : గదగ జిల్లా మొరార్జీ దేశాయి హాస్టల్‌లో బుధవారం ఉదయం ఉప్మా తిన్న విద్యార్థినుల్లో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిని బెటగేరి ప్రభుత్వ సముదాయ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. చికిత్స అనంతరం వారు కోలుకున్నారని డీహెచ్ఓ ఎస్ఎస్ నీలగుంద తెలిపారు.

దర్శన్‌ను విచారించిన ఆదాయపన్ను శాఖాధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: చిత్రదుర్గం జిల్లాకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో బళ్లారి కేంద్ర కారాగారంలో ఉన్న నిందితుడు, సినీ నటుడు దర్శన్‌ను ఆదాయపన్ను శాఖాధికారులు గురువారం జైల్లో విచారించారు. రేణుకా స్వామిని హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని తరలించడానికి దర్శన్ పెద్ద మొత్తంలో నగదు ఖర్చు చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో ఆదాయ పన్నుశాఖాధికారులు బెంగళూరు నుంచి బళ్లారి జైలుకు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు జైలు ముఖ్య అధికారి సమీపంలో గదిలో దర్శన్‌ను విచారణ చేపట్టారు. సాయంత్రం 7.30 గంటల వరకు విచారణ కొనసాగింది. ఆదాయపన్ను శాఖాధికారులు అడిగిన పలు ప్రశ్నలకు దర్శన్ సమాధానం చెప్పి, వారితో సహకరించినట్లు జైలు అధికారులు తెలియజేశారు.

సైనిక శిబిరం విజయవంతం



అభ్యాసం చేస్తున్న క్యాడెట్లు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం నిర్వహిస్తున్న అఖిల భారత వాయు సైనిక్ క్యాంప్-2024కు చక్కని స్పందన లభిస్తోందని భారతీయ వాయుసేన అధికారులు ప్రకటించారు. ఈ శిబిరం అక్టోబరు ఏడో తేదీ వరకు కొనసాగనుంది. శిక్షణలో భాగంగా ఫైరింగ్, మైక్రోలైట్ ఫ్లయింగ్, ఏరో మోడలింగ్, డ్రిల్, డ్రోన్ల వినియోగం తదితరాలు ఉంటాయి. దేశంలోని 16 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 608 మంది క్యాడెట్లు శిక్షణలో పాల్గొంటుండగా.. ఇప్పటికే అత్యధిక అభ్యర్థులు నగరానికి చేరుకున్నారు. శిక్షణ సమయంలో ప్రతిభ చూపించిన అభ్యర్థులకు చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఆల్ ఇండియా వాయు సైనిక్ ట్రోఫీని ప్రదానం చేస్తామని అధికారులు తెలిపారు.



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

దసరా ఉత్సవాల్లో పాలు పితికే పోటీ

బెంగళూరు (క్రీడలు): మైసూరు దసరా ఉత్సవాల్లో పాలు పితికే పోటీ నిర్వహించనున్నారు. రైతు దసరా ఉపసమితి తరఫున జరిగే ఈ పోటీ, శ్వాన ప్రదర్శన కార్యక్రమాల గోడ ప్రతులను పశుసంవర్ధక, పట్టు శాఖ మంత్రి కె.వెంకటేష్ ఆవిష్కరించారు. మైసూరు జలదర్శిని అతిథి గృహంలో అక్టోబరు 6 నుంచి రెండు రోజుల పాటు పోటీ జరుగుతుందని.విజేతకు రూ.లక్ష నగదు బహుమతి అందించనున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న యువ దసరా సంగీత కార్యక్రమంలో ప్రముఖ గాయకులు శ్రేయాఘోషల్, రవిబస్రూర్, రాపర్ బాద్షా, సంగీత దర్శకులు ఇళయరాజా, ఎ.ఆర్.రెహమాన్ బృందం పాల్గొంటారు.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

అంతర జోన్ పోటీలకు ఆళ్వాస్ అర్హత



రాజీవ్‌గాంధీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో జరిగిన మంగళూరు జోన్ వాలీబాల్ పోటీల్లో మూడబిదరే ఆళ్వాస్ కళాశాల ఆరోగ్య విజ్ఞాన జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. గురువారం మంగళూరు కణచూర్ వైద్యకీయ విజ్ఞాన సంస్థలో జరిగిన ఫైనల్లో ఆళ్వాస్ జట్టు 2-0తో కరావళి పార్సిస్ కళాశాలపై గెలుపొందింది. ఉత్తమ ఆటగాడిగా ఎస్.రక్షిత్ వ్యక్తిగత బహుమతి అందుకున్నారు. ఈ విజయంతో శివమొగ్గ వైద్యకీయ విజ్ఞాన సంస్థలో జరిగే అంతర జోన్ టోర్నమెంట్‌కు ఆళ్వాస్ అర్హత సాధించింది. -న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

హో సూ రు క బు ర్లు

అంతర్జాతీయ బధిర దినోత్సవం

హోసూరు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం కృష్ణగిరిలో అంతర్జాతీయ చెవుడు, మూగ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ సరయు నేతృత్వంలో భారీ ర్యాలీ జరిగింది. కృష్ణగిరి ప్రధాన వీధుల్లో సాగిన ఊరేగింపులో 75 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూగ, చెవిటి దివ్యాంగులు 5,620 మంది ఉన్నట్లు తెలిపారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అంతేకాకుండా విద్య, ఉపాధికి అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత ఉపకరణాలు వితరణ చేస్తున్నామని, నెలకు రూ.1,500 ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలకు గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. ఇవన్నీ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. దివ్యాంగ మహిళల వివాహ సమయంలో 12వ తరగతి చదివిన వారికి రూ.25 వేలు, 8 గ్రాముల బంగారు తాళి, పట్టా పొందిన వారికి రూ.50 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సరయు

సాగునీటి సరఫరాకు డిమాండ్

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు శివారు కెలవరపల్లి నీటిని హోసూరు, శూలగిరి ప్రాంతాల్లోని చెరువుల సరఫరా కోసం కొన్నేళ్ల క్రితం కాలువలు తవ్వారు. చెరువులకు నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఆ కాలువలు పూడుకుపోయాయి. వాటిపై ఆధార పడిన రైతుల కుటుంబాలు వ్యవసాయం సాగక అనేక ఇబ్బందులు పడుతున్నారంటూ కర్షకులు కోనేరిపల్లి కాలువ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా కాలువలో పూడికతీత చేపట్టకపోవడం దారుణమన్నారు. వెంటనే కాలువలకు మరమ్మతులు చేయించి రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలువల్లో ఆక్రమణలను తొలిగించాలని, కెలవరపల్లి డ్యామ్‌లో నిల్వ నీటిని ఆలస్యం చేయకుండా సరఫరా చేయడానికి పీడబ్ల్యూడీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాసన్, జిల్లా కార్యదర్శి గణేష్, ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, వెంకటేశన్, నాగరాజ్, వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



కోనేరిపల్లి డ్యామ్ కాలువ వద్ద రైతుల ఆందోళన

రోబోలతో అత్యుత్తమ శస్త్రచికిత్సలు

బెంగళూరు (మల్లేశ్వరం, శివాజీనగర), న్యూస్‌టుడే: భవిష్యత్తులో అన్ని శస్త్రచికిత్సలకు రోబోట్లనే వినియోగించుకోవలసి ఉంటుందని వైద్య విద్య శాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ అన్నారు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌లో కొత్తగా అందుబాటులోకి తెచ్చిన రోబోటిక్ అసిస్టెడ్ పరికరాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తక్కువ కోత, ఎక్కువ నైపుణ్యం, తక్కువ సమయంలో శస్త్రచికిత్సలను చేసేందుకు ఇప్పటికే పలు ఆసుపత్రులు రోబోటిక్ యంత్రాలను వాడుతున్నాయని చెప్పారు. ఈ తరహా విధానంలో భవిష్యత్తులో అన్నిరకాల శస్త్రచికిత్సలను తక్కువ వ్యయంతో చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సంస్థ ఆయా రోబో పనితీరును ఇంట్యూటివ్ సంస్థ సీఈఓ గ్యారీ ఎస్.గుతార్ట్ వివరించారు. సంస్థ ఉపాధ్యక్షుడు డార్లా హట్టన్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



యంత్రాల వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్, రోబోటిక్ శస్త్రచికిత్సలో వైద్యులు

రికార్డు స్థాయిలో ఆపరేషన్లు..

రోబోటిక్ కార్డియాక్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్న 147 రోజుల్లో వంద శస్త్రచికిత్సలను చేసి రికార్డు సృష్టించామని నారాయణ హెల్త్ సిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ దేవిశెట్టి వెల్లడించారు. తక్కువ సమయంలో రోబోటిక్ విధానంలో హృద్రోగులకు ఇన్ని శస్త్రచికిత్సలు నిర్వహించిన దేశంలో మొదటి, ప్రపంచంలో రెండవ ఆసుపత్రిగా తాము నిలిచామన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారాయణ హెల్త్‌సిటీ, కిరణ్ మజుందార్‌షా మెడికల్ సెంటర్‌లో నాలుగో తరం రోబోట్లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. తమ కేంద్రంలో పనిచేసే వైద్యులందరూ రోబోటిక్ శస్త్రచికిత్సల్లో నైపుణ్యం పొందారన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సల్లో శరీర భాగాలను త్రీడీ విధానంలో చూస్తూ, త్వరగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని మరో వైద్యుడు డాక్టర్ ఎంజీ రఘు వెల్లడించారు. గతంలో 6-7 సెం.మీ. కోతతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు చిన్న కోతతోనే ఆ శస్త్రచికిత్స పూర్తవుతుందని వివరించారు.

తల్లి, ఇద్దరు బిడ్డల ఆత్మహత్య

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తుమకూరు మధుగిరి తాలూకాలోని సిద్ధాపుర చెరువులో గురువారం హసీనా తాజ్ (35) అనే గృహిణి ఎనిమిది, ఆరేళ్ల వయసున్న తన ఇద్దరు పిల్లలతో కలిసి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మధుగిరిలో తన భర్త, ఇద్దరు పిల్లలతో ఆమె కలిసి ఉండేది. ఇటీవల తరచూ భర్తతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు చెరువు నుంచి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మధుగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'సిద్ధరామయ్య రాజీనామా చేయవద్దు'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయకూడదంటూ గురువారం ఇక్కడి పాత మైసూరు బ్యాంకు కూడలి నుంచి బీబీఎంపీ బస్టాండు వరకు కన్నడ సంఘాల కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాటాళ్ నాగరాజు మాట్లాడుతూ సిద్ధరామయ్యను గద్దె దించేందుకు భాజపా-జేడీఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆ రెండు పార్టీల నాయకులపై డజన్ పైగా కేసులు ఉన్నాయని, వారందరూ తమ పదవులకు రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. జామీనుపై బయట ఉంటూ కేంద్ర మంత్రి పదవి నిర్వహిస్తున్న కుమారస్వామి రాజీనామా చేశారా అని నిలదీశారు. అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న సిద్ధరామయ్యకు వస్తున్న ప్రజాదరణను సహించలేని భాజపా, జేడీఎస్ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, 15 ఏళ్ల నాటి సంఘటనను ఉన్నత న్యాయస్థానం ముందుకు లాగడం తగదన్నారు. భూ కుంభకోణాలకు పాల్పడిన నాయకులు ప్రస్తుతం నీతి సూక్తులు చెప్పుతున్నారని మండిపడ్డారు.

దసరా ఉత్సవాలకు నాగరాజయ్యకు ఆహ్వానం

బెంగళూరు (మల్లేశ్వరం) : విఖ్యాత దసరా ఉత్సవాల ప్రారంభోత్సవానికి రావాలంటూ సీనియరు సాహితీవేత్త హంప నాగరాజయ్యను మైసూరు జిల్లా పాలన యంత్రాంగం ఆహ్వానం పలికింది. క్రైస్ట్ రోడ్డు పరిధి అమెరికన్ కాలనీలోని నాగరాజయ్య నివాసానికి మైసూరు డీసీ లక్ష్మీకాంతరెడ్డి, నగర పోలీసు కమిషనర్ సీమా లాట్కర్, జడ్పీ సీఈఓ కేఎం గాయత్రి, ఎస్పీ విష్ణువర్ధన్, అదనపు జిల్లాధికారి డాక్టర్ పి.శివరాజ్, చాముండిబెట్ట అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి ఎంజే రూప, స్వాగత సమితి ప్రతినిధులు వచ్చారు. ప్రత్యేకంగా చేయించిన తలపాగా, శాలువా, గంధం పొట్టుతో చేసిన హారంతో ఆయనను సత్కరించి ఆహ్వాన పత్రాన్ని ఆయనకు అందజేశారు. తనకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వానికి, జిల్లా పాలన యంత్రాంగానికి హంప నాగరాజయ్య ఇదే సందర్భంలో కృతజ్ఞతలు తెలిపారు.



హంప నాగరాజయ్యను సత్కరిస్తున్న అధికారులు

హిందూ మహాగణపతి సమితి ర్యాలీ

చిత్రదుర్గంలో హిందూ మహాగణపతి సమితి నిర్వహించిన భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీలో కేసరి వర్ణం దుస్తులు ధరించి, కేసరి పతాకాలను చేతపట్టి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. గురువారం కనకదాసు కూడలిలో విశ్వ హిందూ పరిషత్ కర్ణాటక దక్షిణ ప్రాంత కార్యదర్శి జగన్నాథ్ శాస్త్రి ర్యాలీని ప్రారంభించారు. భక్తులు జై శ్రీరాం, జై హిందూ మహాగణపతి అంటూ నినాదాలు చేస్తు ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ర్యాలీ సంగోలి రాయణ్ణ, అంబేడ్కర్, వాసవి, మదకరి కూడళ్ల మీదుగా ఒనకే ఓబవ్వ కూడలికి చేరుకుంది. -న్యూస్‌టుడే, చిత్రదుర్గం



ఆకట్టుకున్న నృత్య భజనలు

శ్రీక్షేత్రం ధర్మస్థలలో మంజునాథేశ్వర భజన పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 16వ వార్షిక భజనలు, నృత్యాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఐదో రోజు గురువారం విదూషి అనసూయ పాఠక్, మైసూరుకు చెందిన ఉప్పుంద రాజేష్‌పడియార్ తమ గానంతో సభికులను ఆకట్టుకున్నారు. డా.డి.వీరేంద్ర హెగ్గడే, మాతృశ్రీ హేమావతి వి.హెగ్గడే, మోహనదాస పరమహంస స్వామి మాట్లాడారు. ఎస్‌డీఎం కళా కేంద్రం తరపున ప్రదర్శించిన సుధన్వ మోక్ష యక్షగానం అలరించింది. యోగా నిపుణుడు డా.ఐ.శశికాంత్ జైన్ నేతృత్వంలో జరిగింది. గాయకురాలు సౌమ్య గానం సభికుల మన్నన పొందింది. -న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)



ముఖ్యమంత్రి విచారణ ఎదుర్కోవాల్సిందే..

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: సీఎం సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియరు నాయకుడు, మాజీ స్పీకర్ కేబీ కోళివాడ్ హితవు పలికారు. ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సిద్ధరామయ్యకు, తనకు గతంలో అభిప్రాయభేదాలు ఉండేవని, ఇప్పుడు తామిద్దరం మంచి స్నేహితులమన్నారు. ఆయన రాజీనామా చేయడమే ఉత్తమమనేది తన అభిప్రాయమన్నారు. రాజీనామా ఇవ్వకుండా, న్యాయపోరాటం చేయాలన్నది సీఎం అభిప్రాయమన్నారు. విపక్షాలు ఈ అంశాన్ని రచ్చ చేస్తూ, పోరాటాన్ని తీవ్రం చేసిన నేపథ్యంలో ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బంది కలుగకుండా రాజీనామా చేయడమే ఉత్తమమని ఆయన పేర్కొన్నారు.

వినాయక విగ్రహం నిమజ్జనం

బెంగళూరు (యలహంక): యలహంక పాత ఊరులోని కొండప్ప లేఅవుట్‌లో స్థానిక యువకులు ఏర్పాటు చేసిన గణేశ విగ్రహానికి గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలతో పురవీధుల్లో స్వామి మూర్తిని ఘనంగా ఊరేగించారు. దారి పొడవునా భక్తులు లంబోదరుడికి నీరాజనం పట్టారు. అనంతరం యలహంక చెరువు వద్ద ఏర్పాటు చేసిన పుష్కరిణిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉన్నత న్యాయస్థానం తీర్పుపై అసంతృప్తి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ముడా అక్రమాలకు సంబంధించి దర్యాప్తునకు అవకాశం కల్పిస్తూ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తాను గౌరవిస్తున్నానని హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ తెలిపారు. తనతో పాటు తమ పార్టీ నాయకులు ఎవరికీ ఈ తీర్పు తృప్తిని ఇవ్వలేదన్నారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో పోరాటం చేయాలని పార్టీ హైకమాండ్ నాయకులు సూచించారని చెప్పారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పాలన వ్యవహారాల్లో ప్రతి అంశంలోనూ గవర్నర్ జోక్యం చేసుకునేలా భాజపా ఒత్తిడి తీసుకువస్తోందని ఆరోపించారు.

అర్హులందరికీ గ్యారంటీ ఫలాల లబ్ధి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే: దాసరహళ్లి నియోజకవర్గంలోని ప్రతి వార్డులోని అర్హులందరికీ తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారెంటీ పథకాల లబ్ధి అందుతుందని రాష్ట్ర గ్యారంటీ కమిటీ అధ్యక్షుడు హెచ్.ఎం.రేవణ్ణ అన్నారు. గురువారం దాసరహళ్లి నియోజకవర్గ గ్యారంటీ పథకాల సమితి అధ్యక్షుడు కె.సి.దేవేగౌడ బాగలగుంటలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని హెచ్.ఎం.రేవణ్ణ, మాజీ ఎమ్మెల్యే మంజుథ్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవణ్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేరుతుందన్నారు. త్వరలోనే గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాల డబ్బు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో పడతాయన్నారు. కార్యక్రమంలో విధానపరిషత్ సభ్యుడు రామోజీగౌడ, మహిళా కమిషనర్ నాగలక్ష్మిచౌదరి, పార్టీ ఉత్తర జిల్లా అధ్యక్షుడు అబ్దుల్, సీఎంసీ మాజీ అధ్యక్షుడు కె.సి.అశోక్, మహిళా నాయకురాళ్లు ప్రేమ, హేమ దేవేగౌడను ఘనంగా సన్మానించారు.



దేవేగౌడను సత్కరిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు

సమస్యలపై గ్రామ పాలనాధికారుల ధర్నా

పావగడ, న్యూస్‌టుడే: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ తాలూకాలోని గ్రామ పాలనాధికారులు, గ్రామ సహాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. తాలూకా గ్రామ పాలనాధికారుల సంఘం అధ్యక్షుడు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తమకు సక్రమంగా విధులు నిర్వహించడానికి వీల్లేకుండా మొబైల్ ఆప్‌లతో అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారని, 30 ఏళ్లుగా గ్రామ పాలనాధికారులకు పదోన్నతి కల్పించడం లేదన్నారు. సమస్యలు తీర్చకపోతే రాష్ట్ర సంఘం అధ్యక్షుడి మార్గదర్శనంలో జిల్లా స్థాయిలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. తహసీల్దారు వరదరాజుకు వినతిపత్రం అందజేశారు. నిరసన తెలిపిన వారిలో గ్రామ పాలనాధికారుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రామలింగయ్య, ఉపాధ్యక్షుడు మాయిగయి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, సభ్యులు షణ్ముఖరాధ్య, అరుణ్‌కుమార్, ఆసిఫ్, రాజేష్, శ్రీలక్ష్మి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతానికి అన్నదమ్ముల బలి

కలబురగి, న్యూస్‌టుడే: ద్రాక్ష తోటలో పనిచేస్తున్న సమయంలో విద్యుత్తు తీగ తగిలి శ్రీకాంత విజాపుర, ఆయన అన్న రాజకుమార విజాపుర దుర్మరణం పాలయ్యారు. తీగకు శ్రీకాంత పట్టుకున్న ఇనుప కంబీ తగలడంతో షాక్ కొట్టింది. తమ్ముడిని కాపాడేందుకు రాజకుమార ప్రయత్నించారు. ఈక్రమంలో ఇద్దరూ చనిపోయారు. వీరు బాబానగరకు చెందిన వారు. తికోటా ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి మృతి...

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని శివ కూడలిలో ఓ దుకాణంలో విద్యుత్తు పనులు చేస్తున్న మొయిన్ పాషా (19) అనే యువకుడు బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై చనిపోయినట్లు గురువారం పట్టణ ఎస్సై డాక్టర్ నాయక్ తెలిపారు. బెంగళూరుకు చెందిన మొయిన్ పాషా విద్యుత్తు పనుల నిమిత్తం ఎమ్మిగనూరు వచ్చారు. దుకాణంలో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

ఉడుపి, న్యూస్‌టుడే: బైందూరు పరిధి కొల్లూరు సమీపంలోని ఇడూరు వద్ద గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పికప్ వాహనాన్ని ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులు వాసిం, రాఘవేంద్ర, అమృత, ప్రత్యుష్ఠి, అఖిత్‌ను చికిత్స నిమిత్తం కుందాపురలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

పోలీసుల అదుపులో నిందితులు

కార్వార, న్యూస్‌టుడే: పణకోణలో పారిశ్రామికవేత్త వినాయక్ నాయక్‌ను హత్య చేసిన కేసులో బీహారుకు చెందిన అజ్మల్ జాబిర్, మాసుమ్ మంజూర్, అసోంకు చెందిన లక్ జ్యోతినాథ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు గురుప్రసాద్ రాణే ఇప్పటికే మాండోవి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆయన ఈ ముగ్గురు నిందితులకు కిరాయి ఇచ్చి వినాయక్‌ను హత్య చేయించాడు. ఈ ఘటనలో హతుడు భార్య కూడా తీవ్రంగా గాయపడింది. వ్యాపారంలో పోటీని సహించలేక గురుప్రసాద్ ఈ హత్య చేయించినట్లు పోలీసులు వెల్లడించారు.

ఫేస్‌బుక్ ద్వారా యువతి మోసం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన ఓ యువతి మాయమాటలు చెప్పి రూ.1.08 లక్షలు తీసుకోవడంతో పాటు అశ్లీల వీడియోలున్నట్లు బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటన బైయ్యప్పనహళ్లి పోలీసుఠాణా పరిధిలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిశికాశర్మ అనే యువతిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రిశికాశర్మ పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ప్రొఫైల్ ద్వారా టెకీకి 18న సందేశం వచ్చింది. ఇద్దరి మధ్య ఫేస్‌బుక్ ద్వారా మాటలు కలిశాయి. టెకీ తన వాట్సాప్ నంబరు ఆమెకు ఇచ్చారు. మూడు రోజులు తర్వాత ఆమెతో వాట్సాప్ కాల్ చేసి మాట్లాడారు. టెకీ ముఖం మార్ఫింగ్ చేసిన ఆమె అశ్లీల వీడియోలను అతడికి వాట్సాప్‌లో పంపింది. భయపడిన టెకీ ఆమె అడిగిన నగదును మూడు దఫాలుగా పంపించారు. రూ.1.08 లక్షలు ఇచ్చినా ఆమె విడిచిపెట్టకుండా మళ్లీ డబ్బు కోసం డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు చోరుల అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు, ఆటోలను దొంగిలిస్తున్నారనే ఆరోపణలపై ఉళ్లాల నివాసులు అహ్మద్‌ఖాన్, ఫైరోజ్ పాషాను అన్నపూణేశ్వరి నగర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.3.25 లక్షల విలువచేసే రెండు ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

చరవాణిలు స్వాధీనం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: పాదచారుల చేతుల్లోని చరవాణిలను లాక్కొని పరారవుతున్న ఎంఎస్‌పాళ్య నివాసి షాబాజ్ ఖాన్, నాయండనహళ్లి వాసి ముబారక్‌ను అన్నపూణేశ్వరి నగర పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.15 లక్షల విలువచేసే 11 చరవాణిలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.3.8 లక్షల జరిమానా వసూలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగర తూర్పు విభాగం సంచార పోలీసులు బుధవారం రాత్రి ప్రత్యేక కార్యాచరణ జరిపి వాహనాల తనిఖీ చేపట్టారు. సంచార నిబంధనలు ఉల్లంఘించారంటూ 616 మంది వాహనాలకు వ్యతిరేకంగా కేసులు నమోదు చేశారు. ఆయా వాహనాల యజమానుల నుంచి రూ.3.8 లక్షల జరిమానా వసూలు చేసినట్లు సంచార విభాగం డీసీపీ కులదీప్‌కుమార్ ఆర్.జైన్ తెలిపారు. ఇకపైనా తనిఖీలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

భర్తను హత్య చేయించింది

దావణగెరె, న్యూస్‌టుడే: తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయించిన భార్య బీబీ ఆయేషా, ఆమె ప్రియుడు మంజేనాథ్‌ను బసవపట్టణ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. తన భర్త ఇలియాజ్ అహ్మద్‌ను గత ఫిబ్రవరి 20న వారిద్దరూ కలిసి హత్య చేశారు. తన భర్త కనిపించకుండా పోయారని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇలియాజ్ మృతదేహాన్ని మలేబెన్నూరు పరిధి భద్రా కాలువలో కుళ్లిన స్థితిలో ఫిబ్రవరి 26న పోలీసులు గుర్తించారు. బీబీ ఆయేషా తీరుపై అనుమానంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయగా నోరువిప్పింది. నిందితులను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

నగరంలో ఈనాడు

★ ఉదయం 10.30 గంటలకు కేజీరోడ్డు ఎఫ్‌కేసీసీ సమావేశ మందిరంలో కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య 107వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ ప్రవీణ్‌కహనదేల్‌వాల్ ప్రారంభిస్తారు.

★ ఉదయం 10.30 గంటలకు రాజప్రస్థానం మైదానంలో లఘు ఉద్యోగి భారతి వస్తు ప్రదర్శన కొనసాగుతుంది.

★ ఉదయం 11 గంటలకు హెసరుఘట్ట భారతీయ ఉద్యాన వనాల పరిశోధన సంస్థ ఆవరణలో మొక్కల సంరక్షణ జాతీయ సదస్సు సాగుతుంది.

★ సాయంత్రం 5 గంటలకు విధానసౌధ బ్యాంకెట్ హాలులో అఖిల భారతీయ, కర్ణాటక మహిళ న్యాయవాదుల సమాఖ్య ఏర్పాటు చేసే జాతీయ సమావేశాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ అనుశివరామన్ ప్రారంభిస్తారు. జస్టిస్ కె.ఎస్.ముదగల్, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ హాజరవుతారు.

★ సాయంత్రం 5.30 గంటలకు పాలికె ఉద్యోగుల భవన్‌లో మాజీ ఎమ్మెల్యే దివంగత జి.నారాయణకుమార్ సర్మణ, జి.నా.కు పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుంది. మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ, కేంద్ర మంత్రి వి.సోమణ్ణ, రవాణా మంత్రి రామలింగారెడ్డి తదితరులు పాల్గొంటారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

మాధ్యమ రంగంలో సవాళ్లపై సదస్సు

కర్ణాటక మాధ్యమ అకాడమీ, సమాచార సార్వత్రిక సంపర్క శాఖ, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పత్రికోద్యమ విభాగాలు, విద్యా సంస్థల ముఖ్యులతో మాధ్యమ శిక్షణపై ఏర్పాటు చేసిన సదస్సు సమాచార శాఖ కేంద్ర కార్యాలయంలో జరిగింది. మాధ్యమ అకాడమి అధ్యక్షురాలు అయేశాఖానం, సమాచార శాఖ సంయుక్త డైరెక్టర్ మంజునాథడొళ్లిన, ఆర్.నవీన్, అకాడమీ కార్యదర్శి సి.ఆర్.రూప, సభ్యుడు కె.నింగజ్జ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మాధ్యమ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, డిజిటల్ యుగంలో మాధ్యమ విద్యార్థులను వృత్తిపరంగా ఎలా సిద్ధం చేయాలో చర్చించారు. యువ విద్యార్థులకు ప్రోత్సాహ ప్రశస్తులను అందజేయాలని నిర్ణయించారు. అవసరమైన సిఫార్సులను ప్రభుత్వానికి పంపనున్నట్టు సమాచార సార్వత్రిక సంపర్క శాఖ కమిషనర్ హేమంత్ ఎం.నింబాళ్కర్ తెలిపారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)





పీఈఎస్‌లో తరగతుల ప్రారంభం

ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని పీఈఎస్ విశ్వవిద్యాలయంలో ఫార్మసీ, నర్సింగ్, ఫిజియోథెరపీ, అలైడ్ హెల్త్‌సైన్స్ కోర్సుల మొదటి ఏడాది తరగతులను రాజీవ్‌గాంధీ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయ మాజీ ఉప కులపతి డాక్టర్ ఎస్.సచ్చిదానంద గురువారం ప్రారంభించారు. ఈ కోర్సులకు ప్రపంచవ్యాప్తంగా చక్కని డిమాండ్ ఉందని సచ్చిదానంద తెలిపారు. విద్యార్థులు ఉత్సాహం, ఆసక్తి, ఏకాగ్రతతో కోర్సులు పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ జె.సూర్యప్రసాద్, ఆచార్య అజోయ్‌కుమార్, డాక్టర్ కేఎస్ శ్రీధర్, ఆచార్య నాగార్జున ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (మల్లేశ్వరం)

స్వచ్ఛతపై ఆన్‌లైన్‌లో ఉపన్యాస పోటీలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మ గాంధీ 155వ జయంతి సందర్భంగా స్వచ్ఛతపై విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రసంగాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాలికె ప్రత్యేక కమిషనర్ ప్రీతి గహ్లోత్ తెలిపారు. గురువారం ఇక్కడ నగరంలో విద్యార్థులతో కలిసి పాలికె అధికారులు, సిబ్బంది స్వచ్ఛ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమిషనర్ మాట్లాడుతూ ఉద్యాననగరిగా ఖ్యాతి పొందిన బెంగళూరును మరింత పచ్చదనం, పరిశుభ్రంగా మార్చేందుకు స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాంధీ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్వచ్ఛతపై విద్యార్థులను చైతన్యవంతులను చేసేలా ఆన్‌లైన్‌లో ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు.



పనులు చేపట్టిన పాలికె అధికారులు, సిబ్బంది

బళ్కారి

•బళ్కారి •రాయచూరు

యత్నాళ్ నోటికి తాళం వేయండి

సింధనూరు, న్యూస్‌టుడే: నోటికి హద్దూ..అదుపూ లేకుండా వ్యాఖ్యలు చేస్తూ ప్రజల్లో కలహాలు సృష్టిస్తున్న భాజపా ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని, ఆయన శాసనసభ సభ్యత్వం రద్దు చేసి బర్తరఫ్ చేయాలని కోరుతూ సింధనూరులో దళిత, వెనుకబడిన వర్గాలు, ముస్లిం అల్పసంఖ్యాత యువకులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక ఐబీ నుంచి నినాదాలతో..ప్రదర్శనలు ప్రదర్శనగా మినీ విధానసౌధ వరకు నడిచారు. ముధోళ సభలో యత్నాళ్ స్వాతంత్ర్య సమరయోధుడు టిప్పు సుల్తాన్‌పై అవహేళనకర వ్యాఖ్యలు చేయడం సహించరాని నేర మని దుయ్యబట్టారు. తక్షణం ఆయన నోటికి తాళం పడాలంటే ఎమ్మెల్యేగా సభ్యత్వం రద్దు చేయా లని డిమాండ్ చేశారు.

కోట ప్రాంతంలో శ్రమదానం

రాయచూరు: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ఎస్ విభాగం విద్యార్థినులు స్థానిక మాలిన చెరువు, కోట ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ సీసాలు, కాగితాలు ఏరివేశారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించారు. నగరం, వాహనాల్లో తరలించారు. వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్న ఆ ప్రాంతం సుందరంగా మారింది. స్వచ్ఛ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థినులు చేపట్టిన శ్రమదానానికి స్థానికులు సహ కరించారు. అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ రేవూరి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణకు ఇంటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ సామగ్రిని విని యోగించవద్దని విజ్ఞప్తి చేశారు. నగరం, తాలూకాలోని గ్రామాల్లో గత ఎనిమిది రోజులుగా నిర్వహించిన స్వచ్ఛత పనులకు ప్రజల నుంచి ఉత్తమ స్పందన లభించిందని హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు ప్రముఖుడు నరసింహమూర్తి మృతి

సింధనూరు: సింధనూరు తాలూకా తెలుగు ప్రముఖులు, మాజీ వైమానికాధి కారి సంకురాత్రి నరసింహమూర్తి (80) గురువారం సాయంత్రం హైదరాబాదులోని ఆసుపత్రిలో మృతి చెందారు. గోరేబాళ క్యాంపులోని ఆయన స్వగృహంలో రెండు రోజుల కిందట కాలుజారి కిందపడి ప్రమా దంలో చిక్కుకోగా హుటాహుటిన హైదరా బాదు ఆసుపత్రికి తరలించారు. వైద్యం ఫలించక మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అడ్డరోడ్డు మూర్తిగా తాలూకా ప్రజలకు ఈయన సుప రిచితులు. ఎయిర్‌పోర్ట్‌లో సేవలందించి పదవీ విరమణ చేసిన మూర్తి ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో అప్పట్లో గోరేబాళ్‌క్యాంపు సమీపంలోనే గల అడ్డరోడ్డులో పెట్రోలు బంకు స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుగో దావరి జిల్లా రావులపాలెం సమీపంలోని లక్ష్మీ పోలవరం నుంచి 1970లో సింధ నూరు చేరుకున్న మూర్తి వ్యాపారం, వ్యవ సాయంతో ఇక్కడే స్థిరపడిపోయారు. ఈయన మృతి విషయం తెలుసుకుని తాలూకా తెలుగు పెద్దలు నివాళి అర్పిం చారు. శనివారం ఉదయం గోరేబాళ్‌క్యాం పులోనే అంత్యక్రియలు జరుపుతామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ఇంత ఒత్తిడిలో మేం పనులు చేయలేం

సింధనూరు: ఒకటే..రెండూ కాదు 50 యాప్‌లలో రోజూ అభివృద్ధి నివేదికలను చరవాణిలో నిత్యం పంపుతుండాలంటే.. అయ్యేపని కాదు, పని ఒత్తిళ్లతో మా ఆరో గ్యాలు ఏమైపోతాయో అర్థం కావట్లేదు.. మా పరిస్థితి ప్రభుత్వం అర్థం చేసుకోవా లని కోరుతూ సింధనూరులో గురువారం నుంచి గ్రామ పాలనాధికారులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. స్థానిక మినీ విధా నసౌధ ఎదుట బైఠాయించి చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసనలో భాగం వహిం చారు. తక్షణం మాకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి సమస్యను పరిష్కరించి, మా దీర్ఘకాల డిమాండ్లను కూడా పరిష్కరించే వరకూ విధులు చేపట్ట మని చెబుతూ నిరవధిక సమ్మె చేపట్టారు.

భార్యపై కోపం.. చెట్టుపై ప్రతాపం

హావేరి: తన భార్యతో గొడవ పడిన బస వరాజ అనే వ్యక్తి తన మామ దేవేంద్రప్ప పకీరప్ప గాణిగేరారు చెందిన వక్క తోటలో 106 చెట్లను నరికి వేశాడు. పుట్టింటికి వచ్చిన తన భార్యను అత్తామామలు పంపించకుండా తమ వద్దే ఉంచుకున్నారని గొడవ పెట్టుకు న్నాడు. వారి ఇంటికి సమీపంలో ఉన్న వక్క తోటకు వెళ్లి చెట్లను నరికి పరారయ్యాడు. బాధితుని ఫిర్యాదుతో హావేరి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రామయ్యకే వెన్నూదన్ను

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: హరియాణ విధానసభ ఎన్నికల ప్రచార సమయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భాజపా ఆరోప ణలు చేశారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా బెంగళూరు రేస్‌కోర్స్ రోడ్డులోని కాంగ్రెస్ భవన్ ఆవరణలో కార్య కర్తలు గురువారం ధర్నాకు దిగారు. మోదీ రూపాన్ని పోలిన మాస్కులు ధరించి నిరస నకు దిగారు. ఈసందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ మోదీ తీరు ఏమీ బాగాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేం దుకు 'ఆపరేషన్ కమల' మొదలు పెట్టి విఫలమైనట్టు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు తమ పేరు తెచ్చేందుకు భాజపా, జేడీఎస్ నేతలు కుట్రపన్నినట్లు ధ్వజమెత్తారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

26-09-2024 (ఉ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.84	1619.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,368	1,524
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	12,033	9,620
నీటి నిల్వ (టీ.ఎం.సి)	101.148	59.525

గరిష్టసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కర్ణాటకాంధ్రుల జీవనాడి

'తుంగభద్ర' పర్యాటకాభివృద్ధి

హొసపేటె, న్యూస్‌టుడే: పశ్చిమ కనుమల్లో పుట్టి.. ఉత్తర ప్రాంతాలను తాకుతూ.. విజయనగర సామ్రాజ్యపు రాజధాని హంపీని పవిత్రంచేస్తూ.. మూడు రాష్ట్రాల అన్న దాతలకు ఆసరాగా నిలుస్తూ.. పంట పొలాలకు జీవం పోస్తూ సంజీవనిగా మారుతోంది తుంగభద్ర జలాశయం! రైతులు జీవనాడిగానే కాకుండా తుంగభద్రమ్మ సందర్శకు లను రా..రమ్మని పిలుస్తోంది. విజయనగర రాజధాని హంపీ సందర్శనకు వచ్చేవారు తప్పకుండా నదీమతల్లి సోయగాలను ఆస్వాదించటానికి ఇష్టపడుతుంటారు. జలా శయంలో నీటినిల్వలు, పోటు జలాలు, అద్భుతమైన శైలితో నిర్మించిన ఆనకట్ట, దిగువకు నీటిని తీసుకెళ్లే క్రస్ట్ గేట్లు, గలగలపారే నదీ జలాలు తుంగభద్రను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా వాసికెక్కిస్తున్నాయి. ఆనకట్ట నుంచి కంప్లి వరకూ నదీ ప్రాంతాన్ని ఓటర్స్ (నీటిపిల్లుల) సంరక్షణ ప్రాంతంగా అటవీ శాఖ ప్రకటించింది.

● తుంగభద్ర పుట్టుక, ప్రస్థానం మహాద్భుతం. ఇనుప ఖనిజ జిల్లాగా పేరుగాంచిన చిక్కమగళూరులో పుట్టే తుంగ, భద్ర ప్రత్యేక నదులు. అక్కడి నుంచి దిగు వకు పారుతూ శివమొగ్గ జిల్లా దిగువన- దావణగెరె సమీపంలో రెండూ కలిసి తుంగభద్రగా అవతరించడం ఓ అద్భుతమే. 1961లో హొసపేటె వద్ద తుంగభద్రకు ఆనకట్ట నిర్మించి దిగువకు వృథాగా పారుతున్న జలా లను ఒడిసిపట్టడం ప్రారంభించారు.

● ఆకర్షణీయమైన ఉద్యానవనాలు తుంగభద్ర ప్రాంతంలో చూడొచ్చు. సందర్శకులు ఉదయం నుంచి రాత్రిదాకా ఈ వనాల్లో సేదదీరుతారు. రాత్రికి సంగీత కారంజీలు రంజింపచేస్తాయి. జింకలు, గులాబీల పార్కు ఆకట్టుకుంటుంది. పిల్లలు, పెద్దలు ఆట వినో దాన్ని అందివ్వడంతో ఈ ప్రాంతంలో తుంగభద్ర పర్యా టక ప్రాంతంగా విరాజిల్లుతోంది.


తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు పారే గంగమ్మ



ఆనకట్ట గట్టుపైనే ఆకట్టుకునే వర్ణజ చేపల ప్రదర్శనాలయం

కమిషన్ సిఫార్సులపై వ్యతిరేకత

రాయచూరు, న్యూస్‌టుడే: తాము ఎదుర్కొంటున్న వివిధ సమ స్యలు పరిష్కరించాలంటూ 'అఖిల కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా ఒక్కూట' ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విన్నవించింది. ఈమే రకు గురువారం ఒక్కూట జిల్లాధ్యక్షుడు తాయరాజ్ మర్చటాల్ నాయ కత్వంలో ప్రతిని ధులు జిల్లా పాలనాధికారి కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పాత పింఛన్ కావాలని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఒప్పంద, పొరుగు సేవల్లో నియామకాలు వద్దని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న పరిపాలన సంస్కరణల కమిషన్ సిఫార్సులు ఉపసంహరించాలని, ఏడోవేతన సంఘం సిఫార్సుల ప్రకారం వేతనాలు సవరించాలని, 18 నెలల డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. నగదు రహిత ఆరోగ్య బీమా పథకాన్ని జారీ చేయాలని, ఆదాయ పన్ను సీలింగ్ పరిమితిని రూ.10 లక్షలకు పెంచేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు మోహినుద్దీన్, అమరేశప్ప, అలంకాపాడా, మహదేవప్ప, జిల్లా కార్యకారి సమితి సభ్యుడు గోపాల్ పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

భారత్‌లో 80 శాతం మందుల తయారీ

రాయచూరు, న్యూస్‌టుడే: ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారి ఉదయ్ కిశోర్ సూచించారు. నవోదయ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలో తయారయ్యే మందుల్లో 80 శాతం భారత్‌లోనే ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు. కరోనా వేళ టీకా తయారుచేసి అనేక దేశా లకు సరఫరా చేసిన ఘనత భారత్‌కు దక్కడం గర్వకారణమన్నారు. నవోదయ ఫార్మసీ కళాశా లలో నిపుణులైన అధ్యాపకులు, నాణ్యమైన బోధన, మెరుగైన ప్రయోగశాల ఉందన్నారు. ఇక్కడ అభ్యసించిన విద్యార్థులకు సుల భంగా ఉద్యోగాలు లభిస్తున్నా యని హర్షం వ్యక్తం చేశారు. వైద్యులు ఎస్.కె.ఖలీల్, రమేష్ బాబు మాట్లాడుతూ వైద్య రంగంలో ఫార్మసిస్టులు అంది స్తున్న సేవలు అపారమని కొని యాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.దొడ్డయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నాలుగు మిలి యన్ల ఔషధ నిపుణులు సేవలంది స్తున్నట్లు వెల్లడించారు. వీరు కొత్త మందులు ఆవిష్కరిస్తూ, నాణ్యతను పరిశీలిస్తూ, రోగులకు మందులిస్తూ, వాటిని ఎలా తీసుకోవాలో జాగ్రత్తలు చెబుతూ విలువైన కొణాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. వైద్యులు సర్ఫరాజ్ మహ్మద్, శివరాజగౌడ, ట్రస్ట్ మరిస్ సబు, ఉపన్యాసకుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపన్యసిస్తున్న ఉదయ్‌కిశోర్


మాట్లాడుతున్న ప్రతినిధులు

వర్గీకరణ జాప్యంపై 3న జిల్లా బంద్

రాయచూరు, న్యూస్‌టుడే: దళిత వర్గీకరణకు సర్వోన్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు అమల్లో ప్రభుత్వ జాప్యాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబరు 3న జిల్లా బంద్ చేయాలని నిర్ణయించినట్లు వర్గీకరణ ఐక్య పోరాట సమితి ప్రతినిధులు వెల్లడించారు. అంబణ్ణ ఆరోలి, బాలస్వామి కొడ్లి, విరుపాక్షి గురువారం విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణపై సర్కారు హామీ ఇచ్చిందని, అయినప్పటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. జాప్యానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆక్టోబరులో ప్రక్రియ ప్రారంభిం చాలని దళిత సంఘాలు రెండు మాసాల క్రితం గడువు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమస్యలతో ఆలస్యమవుతుందన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. ఏడుగురు న్యాయమూర్తుల పీఠం అనుకూ లంగా తీర్పు ఇస్తే, దీనిపై పరిశీలనకు కాంగ్రెస్ సమితిని నియమించా లని ఆలోచించడం సరికాదన్నారు. విధాన సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వస్తే వర్గీకరిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో పోరాటాన్ని కల్యాణ కర్ణా టకకు విస్తరిస్తామన్నారు. వారి వెంట సమితి ప్రతినిధులు పి.యల్లప్ప, జె.బి.రాజు, శంకరప్ప, విక్రమ్, వీరేశ్ తదితరులున్నారు.

ఉత్తమ రెవెన్యూ అధికారుల ఎంపిక

మాన్వి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పాలనాధికారులు, సహాయక అధికారులు, తహసీ ల్దారులకు ఉత్తమ పాలనాధికారులుగా అవార్డులు ప్రకటించింది. ఈక్రమంలో మాన్వి, సిరివార తాలూ కాల తహసీల్దారు రాజు ఫిరంగి, రవి ఎస్ అంగడి ఉత్తమ రెవెన్యూ అధికారులుగా అవార్డుకు ఎంపి కయ్యారు. శుక్రవారం బెంగళూరులోని వికాస సౌధలో రెవెన్యూ మంత్రి కృష్ణభైరేగౌడ అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందుకోను న్నారు. రాయచూరు నుంచి బదిలీపై వెళ్లిన సహా యక అధికారిణి మహిబూబీకి ఈ అవార్డు దక్కింది. ఆమె దేవదుర్గ తాలూకాకు చెందిన వారు. ఈ అవా ర్డులు తమవి కావని, తమతో కలిసి పనిచేసిన ఆ మొత్తం రెవెన్యూ అధికారులు, సిబ్బందికి చెందుతాయని అవార్డు గ్రహీతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.


రవి ఎస్ అంగడి


రాజు ఫిరంగి

మాన్వి, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న అమ రేశ్‌ను అత్యుత్తమ గ్రామ పాలనాధికారి 2023-24 అవార్డు కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయన సందిహాళ్, కురిడి గ్రామ పంచా యతీల పాలనాధికారిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక గ్రామ పాలనాధికారుల సంఘం తాలూకా శాఖ గురువారం సాయంత్రం అమరేశ్‌ను ఘనంగా సత్కరించింది. సంఘం అధ్యక్షుడు హనుమంతప్ప జెల్లి, వివిధ గ్రామాల గ్రామపాలనాధికారులు, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.


అమరేశ్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

వలలో పడిన చిరుత

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ సిటీ- ఆనేకల్ మధ్య సంచరిస్తున్న ఏడేళ్ల వయసున్న చిరుతను అటవీశాఖ అధికారులు బంధించారు. దాన్ని బన్నేరుఘట్ట అటవీ విభాగానికి తరలించారు. వారం నుంచి చిరుత పలువురికి కని పించింది. జాతీయ రహదారి దాటుతూ కనిపించిన చిరుతను కొందరు వాహనదారులు తమ చర వాణి కెమెరాల్లో చిత్రీకరించారు.

అనుమానిత ఉగ్రవాది అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాజధాని నగర శివారు జిగణి పారిశ్రామికవాడలో కాపలాదారుడిగా పని చేస్తున్న ఓ అనుమానిత ఉగ్ర వాదిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికా రులు గురువారం అరెస్టు చేశారు. ఆ వ్యక్తి అసోంకు చెందిన గిరీశ్ (23)గా గుర్తించారు. ఆగస్టు 10 నుంచి పారిశ్రామికవాడలోని ఓ సంస్థలో కాపలా దారుడిగా పని చేస్తున్నట్లు తేలింది. అసోం తీవ్ర వాద సంస్థలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఎన్ఐఏ అధికారులు తెల్ల వారు జామున దాడిచేసి పట్టుకున్నారు.

తేనెవలలతో బెదిరింపులు

బెళగావి, న్యూస్‌టుడే: హనీట్రాప్ చేయడం, అపహరణలు చేసి నగదు కోసం బెదిరింపులకు పాల్పడుతున్న ఆరోపణలపై నలుగురిని శహాపుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. తిలకవాడికి చెందిన వినాయక కరుడేకర్ నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారు. మళ్లీ డబ్బు కావాలని కొద్ది రోజులుగా వీరు వేధిస్తున్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో గాలించి.. దివ్యా సవాశె (22), ఆమె అనుచరులు ప్రశాంత కెల్లూర్, కుమార గోకర్ణనవర, రాజు గాగడి అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.పది లక్షల నగదు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, రెండు వారాల న్యాయ నిర్బంధానికి పంపిస్తూ ఆదేశించారు.

28, 29న సంగీత సమ్మేళనం


వివరాలు తెలుపుతున్న చిన్నయ్యస్వామి పక్కన రఘుపతి, ఈరణ్ణ, సిద్ధయ్య తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే: దివంగత పుట్టరాజ గవాయి 14వ వర్ధంతి పుర స్కరించుకుని 28, 29 తేదీల్లో ఇక్కడి సోమవారపేట హిరేమఠంలో అంతర్జాతీయ కళాకారులతో సంగీత సమ్మేళనం ఉంటుందని పుట్టరాజ సాంస్కృతిక ట్రస్ట్ కోశా ధికారి చిన్నయ్య స్వామి వెల్లడించారు. ఆయన గురువారం పత్రికా భవన్‌లో పాత్రికేయులకు వివరాలు తెలిపారు. కార్యక్రమానికి రాయచోటి వీర శివాచార్య స్వామి సాన్నిధ్యం వహిస్తారని, స్వాములు శాంతమల్ల శివాచార్యులు, వీర సంగ మేశ్వర శివాచార్య ప్రారంభిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి బోసురాజు, శాసనసభ్యుడు శివరాజ్‌పాటిల్, పురపాలిక అధ్యక్షురాలు నరసమ్మ హాజరవుతా రని తెలిపారు. సమ్మేళనంలో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించామన్నారు. ఎందరో సంగీత కళాకారులను తయారుచేసిన పుట్టరాజ అందజేసిన సేవలను స్మరించుకునేందుకు ఏటా వర్ధంతి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంగీత అభిమా నులు ఈ రెండు రోజులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని కోరారు. ఆయన వెంట ట్రస్ట్ ప్రతినిధులు రఘుపతి పూజారి, ఈరణ్ణ హలగార, సిద్ధయ్య స్వామి, విజయకుమార్ తదితరులున్నారు.

సమస్యలపై గ్రామాధికారుల నిరసన

మాన్వి, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ శాఖ అభివృద్ధి చేసిన 17 పైగా యాప్ వెబ్ సాంకేతిక తంత్రజ్ఞానం అమల్లో సమస్యలు వస్తున్నాయని, వాటిని పరిష్కరించి తగిన వసతులు కల్పించాలని గురువారం కర్ణాటక గ్రామ పాలనాధికారుల సంఘం సభ్యులు మాన్వి, సిరివార, లింగసుగూరుల్లో ధర్నాలు చేశారు. మాన్విలో ఎమ్మెల్యే భవనం, సిరివారలో తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు విధులు బహి ష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. విధుల నిర్వహణకు సరైన సదుపా యాలు లేవన్నారు. అన్ని తంత్రాంశాలు నిక్షిప్తం చేసు కునే చరవాణులు, స్కానర్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు లేకుండా విధులు నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. సాంకేతిక సమస్యలతో వినియోగదారులకు సకాలంలో సేవలు అందించలేదని పరిస్థితి నెలకొందన్నారు. సెలవు రోజుల్లోనూ పనిచేయాల్సి వస్తోంది, కింది అధి కారులకు తాఖీదులు జారీ చేయడాన్ని విరమించుకోవా లని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు పెంచా లని కోరారు. నిరసన తెలిపిన వారిలో సంఘం తాలూకా శాఖ అధ్యక్షుడు హనుమంతప్ప జెల్లి, సిరివార మాజీ అధ్యక్షుడు అయ్యనగౌడ, ఉప తహసీల్దారు వినా యకరావు, విరుపణ్ణ, వాసవి, సిద్ధనగౌడ, ఆర్‌వి శ్రీనాథ్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సంగమేష్, అమరేశ్, అబ్దుల్ గఫూర్, మౌనేశ్, సుశీలా, రాధా, శ్వేత, సింధూ, కుసుమ, శ్రీకాంత్, అశోక్, రమేష్, యల్లప్ప, సోయబ్ తదితరులున్నారు.


ఎమ్మెల్యే భవనం వద్ద ధర్నా చేస్తున్న గ్రామాధికారులు

దళిత, గిరిజన గుత్తేదారులకు పనులివ్వండి

రాయచూరు, న్యూస్‌టుడే: ప్రజాపనులు, నీటిపారు దల, జెస్కాం, పంచాయతీరాజ్ శాఖలు, స్థానిక సంస్థల్లో రూ.కోటి వరకు సివిల్, మౌలికవసతుల కల్పన పనుల్లో ఎస్సీ గుత్తేదారులకు 17.5 శాతం, ఎస్టీ గుత్తేదారులకు 7.5 శాతం పనులు కేటాయించాలని కర్ణాటక విధానమం డలి ఎస్సీ ఎస్టీల సంక్షేమ సమితి అధ్య క్షుడు పి.ఎం.నరేంద్ర స్వామి అధికారులను డిమాండ్ చేశారు. ఆయన గురువారం జిల్లా పంచాయతీ సభాంగణంలో దళిత, గిరిజన సముదాయాల ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 20.79 శాతమున్న ఎస్సీలు, 19.03 శాతమున్న ఎస్టీల సంక్షేమం కోసం విడుదల చేసిన నిధులను వంద శాతం ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని కోరారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి అభివృద్ధి సముదాయ సెబ్బబడిలో పరిశ్ర మల స్థాపనకు అధిక రుణం ఇవ్వాలని సూచించారు. జలజీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికీ నీటిని సరఫరా చేయాలని, నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు సమ కూర్చాలని, శ్మశాన భూమి కొరతను నివారించాలని నిర్దే శించారు. రాయచూరు వైద్య విజ్ఞాన ఆసుపత్రి(రిమ్స్)లో వైద్యుల కొరత ఉండరా దని, రోగులకు మెరు గైన చికిత్స అందించా లని డైరెక్టర్‌ను కోరారు. వెనుకబడిన వర్గాల్లో వెనుకబడిన విద్యార్థులు రాణించే లా ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన చేపట్టా లని సూచనలు చేశారు. నేలా సూచనలు చేయా లని విద్యాశాఖ అధికా రికి సూచించారు. మాజీ దేవదాసీలకు పునరావాస కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పాలనాధికారి నితీష్, జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ తుకారం పాండ్వే, సమితి సభ్యులు దుర్యోధన మహలింగప్ప, బసనగౌడ దద్దల్, బసవరాజ్ మత్తిమూడ్, కరెమ్మ, శాంతారామ్, జగదేవ్ గుత్తేదార్ చేదకిస్తా ఆనందయ్యారు.



అధికారులకు సూచనలు చేస్తున్న నరేంద్ర స్వామి

కార్మిక చట్టాలపై అవగాహన తప్పనిసరి

మాన్వి, న్యూస్‌టుడే: కార్మికులు తమ హక్కులతో పాటు కార్మిక చట్టాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ పాటిల్ అన్నారు. తాలూకా న్యాయసేవ దుల సంఘం, అధికార యంత్రాంగం, కానూను సేవ సమితుల ఆధ్వ ర్యంలో గురువారం పంచాయతీ సభాంగణంలో కార్మికులకు నిర్వహిం చిన ఒకరోజు అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల సమస్యలు, పేదరికం నిర్మూలన, యోజనల అమలుపై కార్య శాల నిర్వహించారు. కార్మికుల అభివృద్ధి కోసం ప్రత్యేకించి కార్మిక శాఖ ఉందన్నారు. దీని ద్వారా కార్మికులు, కుటుంబాలు లబ్ధి పొందవచ్చ న్నారు. పథకాలపై అవగాహన ఉంటే వాటిని పొందటం సులభం అవు తుందన్నారు. న్యాయ సేవా సమితి ద్వారా కార్మికులు ఉచిత సేవలు పొందవచ్చన్నారు. విశ్వ నాథ్ పాటిల్, మధుసూ దన్, మల్లప్పదొర ఉప న్యాసం చేశారు. ఉపత హసీల్దార్ వినాయకరావు, బీఈఓ చంద్రశేఖర్, తాలూకా పంచాయతీ మేనేజర్ బసవరాజ్, డి. నాగరాజ్, శ్రీధర్, కార్మిక సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్‌పాటిల్